Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 194 మేడ్చల్ మల్కాజ్‌గిరి 4 ఆగస్టు 2023 శుక్రవారం పేజీలు : 4

## హెచ్-1బీ వీసాలకు రెండో విడత లాటరీ

వాషింగ్టన్ : అమెరికన్ హెచ్-1బీ వీసాలకు దరఖాస్తు చేసిన వారికి శుభవార్త. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అధికారులు ఈ వీసాలకు రెండో విడత లాటరీ పూర్తి చేశారు. అమెరికన్ సంస్థల్లో చేరే ప్రత్యేక నైపుణ్యాలు గల ఉద్యోగులకు హెచ్1-బీ వీసాలు జారీ చేస్తారు. ప్రధానంగా అమెరికన్ టెక్ కంపెనీలు భారత్, చైనా వంటి దేశాల నుంచి వేలసంఖ్యలో ఉద్యోగులను ఈ వీసా ద్వారా నియమిస్తున్నాయి. 2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి హెచ్1-బీ వీసాకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి నుంచి తగిన సంఖ్యలో అభ్యర్థులను ఎంపిక చేసినట్లు యూఎస్ సిటిజెన్‌షిప్, ఇమ్మిగ్రేషన్ సేవల సంస్థ(యూఎససీఐఎస్) వెల్లడిం చింది. అక్టోబరు ఒకటవ తేదీతో ప్రారంభమయ్యే ఈ ఆర్థిక సంవత్సరానికి హెచ్1-బీ వీసాలకు అర్హత సాధిం చిన వారికి ఇప్పటికే సమాచారం ఇచ్చినట్లు తెలిపింది.



# తెలంగాణలోనూ కర్నాటక ఫార్ములా!

## కసిగా చక్రం తిప్పుతున్న కాంగ్రెస్ అధిష్టానం!!

హైదరాబాద్ : వరుస ఎదురుదెబ్బల అనంతరం వచ్చే సక్సెస్ ఇచ్చే సంతోషం ఎంతన్నది కర్ణాటక కాంగ్రెస్ నేతల్ని చూస్తే అర్థమవుతుంది. ఒక బలమైన రాష్ట్ర పగ్గాలు సాధించాలన్న కోరిక కాంగ్రెస్ కు తీరింది. గడిచిన కొన్నేళ్లుగా విజయావలకు దూరంగా.. ఓటములకు దగ్గర అవుతున్న వేళ.. గ్రూపుల్ని.. పంచాయితీల్ని పక్కన పెట్టి మూకుమ్మడిగా కలిసి పోరాడిన దానికి బదులుగా కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయాన్ని సాధించింది. కర్ణాటక ఎన్నికల సందర్భంగా టికెట్ల పంపిణీ విషయంలో తాము అమలు చేసిన ఫార్ములాను.. తాజాగా తెలంగాణలోనూ అమలు చేయాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. కర్ణాటక తరహాలోనే తెలంగాణలోనూ టికెట్లను కేటాయించాలన్న అభిప్రాయం పార్టీ అధినాయకత్వంలో ఉన్నట్లుగా చెబుతున్నారు.

తెలంగాణలో బలమైన ఓటు బ్యాంకు ఉన్న బీసీలను ఒక తాటి మీదకు తీసుకురావటం.. వారిని తమవైపునకు తిప్పుకునేలా చేయగలిగితే.. తెలంగాణ ఎన్నికల్లో విజయం సాధించటం పెద్ద కష్టం కాదన్న మాట వినిపిస్తోంది. తెలంగాణలో బీసీ వర్గాల ఓటు బ్యాంకు భారీగా ఉన్నా.. వారి మధ్య ఉన్న అనైక్యత.. కలిసి కట్టుగా ఓటును ఒక పార్టీకి వేయాలన్న దానిపై ఏకాభ్రిప్రాయం లేని నేపథ్యంలో.. వారందరిని ఒక తాటి మీదకు తీసుకురావాలన్నది కాంగ్రెస్ ఆలోచనగా చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో బీసీ నేతలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్న యోచనలో పార్టీ ఉన్నట్లుగా చెబుతున్నారు. టికెట్ల కేటాయింపుతో సరిపెట్టకుండా పార్టీ విధానాల విషయంలో బీసీలకు పెద్ద పీట వేయాలన్న నిర్ణయానికి వచ్చినట్లుగా తెలుస్తోంది. విద్య.. ఉద్యోగ రంగాల్లో బీసీ వర్గాల రిజర్వేషన్లను 40 శాతానికి పెంచేలా నిర్ణయం తీసుకున్నారు.

ఇదే అంశాన్ని పార్టీ ఎన్నికల హామీ ప్రకటనలోనూ చేరుస్తారని చెబుతున్నారు. కర్ణాటక తరహాలోనే జనాభా ప్రాతిపదికన టికెట్ల కేటాయింపులు జరుగుతాయని చెబుతున్నారు. ఈసారి ఎన్నికల్లో బీసీలకు 50 శాతం టికెట్లు ఇవ్వాలన్న అంశం ప్రధాన అంశంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. గడిచిన రెండు దఫాల్లో కేసీఆర్ సర్కారు చేసిన భారీ అప్పుల్ని ప్రధానంగా ప్రచారం చేయటంతో పాటు.. ప్రజల్లోకి పెద్ద ఎత్తున వెళ్లేలా ప్లాన్ చేస్తున్నట్లు చెబుతున్నారు. అంతేకాదు.. తెలంగాణ సెంటిమెంట్ ను కూడా వినియోగించుకోవలని భావిస్తున్నారు. లోక్ సభలో తెలంగాణ బిల్లును ఆమోదం పొందిన రోజున జరిగిన నాటకీయ పరిణామాలు.. ఆ రోజున కాంగ్రెస్ ఎంపీల పాత్ర.. బీఆర్ఎస్ ఏమీ చేయని వైనాన్ని తెలిపే వీడియోలను రూపొందించి.. గ్రామాల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేయాలన్న యోచనలో ఉన్నట్లు చెబుతున్నారు. ఆగష్టులో రాష్ట్రంలో రెండు మూడు చోట్ల భారీ బహిరంగ సభలను నిర్వహించాలని నిర్ణయించింది కాంగ్రెస్ హైకమాండ్. ఈ సభల్లో ఏదో ఒక దానికి ప్రియాంక గాంధీని ఆహ్వానిస్తున్నారు. ఇప్పటికే ఆమె నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చేయటంతో ఆ దిశగా ఏర్పాట్లను చేస్తున్నారు.



## మూడు రోజులపాటు అసెంబ్లీ.. బీఏసీ సమావేశంలో నిర్ణయం

హైదరాబాద్: అసెంబ్లీ సమావేశాల నిర్వహణపై స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశం ముగిసింది. ఈ సందర్భంగా సమావేశాల నిర్వహణతోపాటు పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వం తరఫున మంత్రులు హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నుంచి మల్లు భట్టి విక్రమార్క, ఎంఐఎం తరఫున అక్బరుద్దీన్ ఒవైసీ పాల్గొన్నారు. ఈ భేటీలో మూడు రోజుల పాటు సమావేశాలు నిర్వహించాలని బీఏసీ నిర్ణయించింది. ఈ సందర్భంగా ఎక్కువ రోజులు సమావేశాలు నిర్వహించాలని విపక్షాలు కోరాయి. అయితే పని దినాలు కాదు, పని గంటలపై చూడాలని మంత్రి హరీశ్ రావు అన్నారు. భారీ వర్షాలు, వరదలు, ప్రభుత్వ చర్యలపై చర్చించాలని నిర్ణయించారు. సమావేశాల్లో ప్రభుత్వం దాదాపు పది బిల్లులను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నది. శుక్రవారం వరదలు, శనివారం పలు బిల్లులపై చర్చించనున్నారు.

# నివురుగప్పిన నిప్పులా కమల దళంలో తీవ్ర అసంతృప్తి!




## పదవులు పంచినా ఢిల్లీకి టీ బీజేపీ నేతల క్యూ..?

హైదరాబాద్ : రోగం ఒక చోట ఉంటే మందు మరో చోట అన్నట్లుగా తెలంగాణాలో బీజేపీ వ్యవహార శైలి ఉంది అని అంటున్నారు. తెలంగాణాలో బిజెపి చేపడుతున్న నియామకాలు ఇస్తున్న పదవులు అన్నీ కూడా నేతలకు ఏ మాత్రం సంతృప్తిని ఇవ్వకపోగా కొత్త తగవులు అసమ్మతి సెగలూ పొగలూ చుట్టుకుంటున్నాయని అంటున్నారు. నిన్నటిదాకా తెలంగాణా బీజేపీ ప్రెసిడెంట్ గా ఉన్న బండి సంజయ్ కి తప్పించారు. పోనీలే కేంద్ర మంత్రి పదవి ఇస్తారు అనుకుంటే ఇపుడు తొమ్మిది మంది జాతీయ ప్రధాన కార్యదర్శులలో ఆయనను ఒకడిగా నియమించారు. అది కూడా ఏడవ నంబర్ తో సర్దారు అని ఆయన వర్గం గుర్రుమంటోంది. దాంతో బండికి ఈ పదవిని చూపించి కేంద్ర మంత్రి చాన్స్ లేకుండా చేశారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారుట. ఇక బీజేపీ జాతీయ ఉపాధ్యక్ష పదవిలో డీకే అరుణ ఇప్పటికే ఉన్నారు. ఆమెను మరోసారి కొనసాగిస్తున్నారు. దాంతో డీకే కూడా ఏ మాత్రం హ్యాపీగా లేరు అని అంటున్నారు. ఆమె తాను సీఎం క్యాండిడేట్ ని అని అంటున్నారు. ఆమె అనుచర వర్గం అలాగే భావిస్తోంది. గద్వాల చుట్టు పక్కల ప్రాంతాలలో పట్టు ఆమెకు ఉంది. దాంతో పాటు సామాజికవర్గం కూడా తనకు ప్లస్ అవుతుందని ఆమె భావించారు. కానీ అదే సామాజికవర్గానికి చెందిన కిషన్ రెడ్డిని పార్టీ ప్రెసిడెంట్ గా చేశారు. నిజానికి ఆ పదవిని డీకే ఆశించారు అని అంటారు. కానీ హై కమాండ్ వేరేగా డెసిషన్ తీసుకోవడంతో ఆమె వర్గం మండుతోందిట. ఇక కిషన్ రెడ్డిని తీసుకుంటే ఆయన హ్యాపీగా కీలకమైన శాఖలతో కేంద్ర మంత్రిగా ఉన్నారు. ఆయనకు ఇష్టం లేకపోయినా టీ బీజేపీ ప్రెసిడెంట్ చేశారని అంటున్నారు. ఇక కిరణ్ కుమార్ రెడ్డి మాజీ సీఎం. ఆయనకు కీలకమైన పార్టీ పదవులు వస్తాయనుకుంటే జాతీయ కార్యవర్గ సభ్యుడిగా మాత్రమే నియమించారు.

ఇంకో వైపు ఈటెల రాజేందర్ ని ఎన్నికల కమిటీ ప్రెసిడెంట్ గా నియమించారు. కానీ ఆయన కూడా పూర్తి హ్యాపీగా లేరనే అంటున్నారు. దానికి కారణం వర్గ పోరే అని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పదవులు ఎందరికి ఇచ్చినా కూడా అసమ్మతి అలా పెరిగిపోతోంది. తనకు ఇచ్చిన జాతీయ ప్రధాన కార్యదర్శి పదవి పట్ల బండి ఎలా రియాక్ట్ అవుతారో తెలియదు కానీ ఆయన ఢిల్లీ బయల్దేరి వెళ్ళారని అంటున్నారు. అదే విధంగా డీకే అరుణ కూడా బీజేపీ పెద్దలను కలిసేందుకు ఢిల్లీ వెళ్లారని అంటున్నారు. అదే విధంగా ఈటెల కూడా ఢిల్లీ ఫ్లైట్ ఎక్కడానికి రెడీ అయ్యారని చెబుతున్నారు. బీజేపీ గ్రాఫ్ చూస్తే కర్నాటక ఎన్నికల తరువాత బాగా పడిపోయింది. ఇక గత నెల రోజులుగా పదవుల భర్తీ సామాజిక న్యాయం అంటూ బీజేపీ చేస్తున్న ఆపరేషన్ పెద్దగా ఫలితాలు ఇవ్వకపోగా మరింతగా అగ్గి రాజేస్తోంది అని అంటున్నారు. ముంగిట్లో ఎన్నికలు ఉంచుకుని బీజేపీ ఇంకా పదవుల పందేరంతోనే మునిగితేలుతూంటే దక్కిన వాళ్ళు ఒకలా దక్కని వారు మరోలా రియాక్ట్ అవుతున్న వేళ సమరానికి సన్నద్ధం అయ్యేదెలా అన్న చర్చ అయితే సగటు బీజేపీ క్యాడర్ లో ఉందనే అంటున్నారు.

# 'సీటు రిజర్వ్' చేసుకుంటున్నారా?



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పక్క చూపులు చూస్తున్నారా?

హైదరాబాద్ : రెండు సార్లు అధికారంలో ఉన్నారు. అయినా వారి బుద్ధి తీరడం లేదు. మూడోసారి వచ్చేందుకు కేసీఆర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ రెండు సార్లు గెలిచిన వ్యతిరేకత తమ కొంప ముంచుతుందని.. మరోసారి గెలవడం కష్టమని బీఆర్ఎస్ నేతలు తెగ బాధపడుతున్నారట.. అందుకే వలసలకు రెడీ అవుతున్నట్టు ఓ ప్రచారం తెలంగాణ రాజకీయాల్లో తెగ సాగుతోంది. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ టికెట్ ఇవ్వడని.. తాము అప్పుడు బాధపడేకంటే ఇప్పుడే సీట్లు రిజర్వ్ చేసుకోవడం బెటర్ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పక్క చూపులు చూస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా బీజేపీ కాంగ్రెస్ పార్టీల్లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ జాబితాలో మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కూడా ఉన్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే కొందరు మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు కూడా ఇలా పైరవీలు చేస్తున్నట్టు లీక్ లు వస్తున్నాయి.

ఆయా పార్టీలతో ఫస్ట్ రౌండ్ చర్చలు పూర్తి చేసుకున్నట్టు టాక్. వచ్చే ఎలక్షన్ లో సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ మళ్లీ టికెట్ దక్కడం కష్టమనే ప్రచారం ఉంది. విషయం గ్రహించిన లీడర్లు ముందుగానే తమ రాజకీయ భవిష్యత్తును ఇతర పార్టీల్లో వెతుక్కుంటున్నారు. ఇలా సుమారు 30 సెగ్మెంట్లలోని లీడర్లు ముందస్తుగా అరెంజ్ మెంట్స్ చేసుకుంటున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే తెలంగాణ ఏర్పాటు తర్వాత నుంచి ఉద్యమకారులకు టికెట్ లు దక్కలేదు.

చాలామంది లీడర్లు బీఆర్ఎస్ టికెట్ పై ఆశలు పెట్టుకున్నారు. వరుసగా రెండు సార్లు అవకాశం రాకపోవడంతో తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ సారి టికెట్ కోసం చివరి నిమిషం వరకూ ఎదురుచూడవద్దనే భావనలో ఉన్నారు. అందుకే ఇప్పటి నుంచే పార్టీ పెద్దల నుంచి వచ్చే సంకేతాలను అంచనా వేసుకొని పార్టీలో ఉండాలా? వద్దా? అనే నిర్ణయం తీసుకోవాలని అనుకుంటున్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చేంత వరకూ ఆగకుండా ముందే సీట్లు సర్దుబాటుకు చూస్తున్నారు. ఇలా బీఆర్ఎస్ లో ఇప్పుడు పక్కచూపుల గోల ఎక్కువైంది. అధికార పార్టీలో సీట్లు దక్కని వారు.. కేసీఆర్ ఇవ్వడని డిసైడ్ అయినవారు.. వ్యతిరేకత ఉన్న వారు ఇతర పార్టీల్లో సీట్ల కోసం ఖర్చీఫ్ లు వేసుకుంటున్న వాతావరణం కనిపిస్తోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# సంపాదకీయం

## ప్రధాని ముఖ్యమంత్రులను సీబీఐ నేరుగా అరెస్టు చేయగలదా?

ప్రస్తుతం ఎన్ఫోర్సుమెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సీబీఐ దేశంలో పలు కేసులను విచారిస్తున్నాయి. ఏపీ సీఎం వైఎస్ జగన్ పై అక్రమాస్తుల కేసును సీబీఐ విచారిస్తోంది. అలాగే జార?ండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ పై పలు కేసులున్నాయి. ఆయనపై ఈడీ కేసులు నమోదు చేసింది. అలాగే ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ పై ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించి కేసులున్నాయి. దీనికి సంబంధించి సీబీఐ అధికారులు తాజాగా కేజ్రీవాల్ ను తొమ్మిది గంటలపాటు విచారించారు. ఆయనను మొత్తం 56 ప్రశ్నలు అడిగారు. ఈ నేపథ్యంలో అరవింద్ కేజ్రీవాల్ ను ఒక దశలో సీబీఐ అరెస్టు చేయొచ్చనే ప్రచారం కూడా సాగింది. అయితే తొమ్మిది గంటల విచారణ అనంతరం సీబీఐ అధికారులు ఆయనను అరెస్టు చేయకుండా వదిలిపెట్టేశారు. ఈ నేపథ్యంలో సీబీఐకి ముఖ్యమంత్రులను ప్రధానమంత్రిని నేరుగా అరెస్టు చేయగల అధికారం ఉందా? లేదా? అనే దానిపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. సివిల్ కేసుల్లో మాత్రం ప్రధానమంత్రి కేంద్ర మంత్రులు లోక్ సభ రాజ్యసభ సభ్యులు ముఖ్యమంత్రి శాసనసభ శాసన మండలి సభ్యులకు అరెస్టు నుంచి మినహాయింపు ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. క్రిమినల్ కేసుల్లో మాత్రం ఈ సెక్షన్ వర్తించదని పేర్కొంటున్నారు. సివిల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 135 ప్రకారం.. పార్లమెంట్ శాసన సభ శాసన మండలి సభ్యుడిని అరెస్టు చేయాలన్నా నిర్బంధించాలన్నా స్పీకర్ సభ చైర్మన్ ఆమోదం తప్పనిసరి. అంతేకాక.. పార్లమెంటు ఆవరణ శాసన సభ శాసన మండలి ఆవరణాల్లో ఏ సభ్యుడిని అరెస్టు చేయడం నిర్బంధించడం కుదరదని ఈ సెక్షన్ చెబుతోందని అంటున్నారు. ఇక క్రిమినల్ కేసులు అయితే ఎవరిని అయినా అరెస్టు చేయొచ్చని న్యాయ నిపుణులు చెబుతున్నారు. అయితే ఆ సమాచారాన్ని స్పీకర్ లేదా చైర్మన్ కు ఇవ్వాల్సి ఉంటుందంటున్నారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి ముఖ్యమంత్రులు పార్లమెంటు శాసనసభల్లో ఏదో ఒకదానిలో సభ్యులే కాబట్టి వారిని కూడా అరెస్టు చేయొచ్చని పేర్కొంటున్నారు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 361 ప్రకారం.. రాష్ట్రపతి గవర్నర్ పదవిలో ఉండగా నిర్బందించడం అరెస్టు చేయడం సాధ్యం కాదని వివరిస్తున్నారు. వారికి వ్యతిరేకంగా ఏ కోర్టు కూడా ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని చెబుతున్నారు. వీరికి సివిల్ క్రిమినల్ కేసులలోనూ మినహాయింపు ఉందని పేర్కొంటున్నారు. రాష్ట్రపతి గవర్నర్ పదవిలో లేకపోతే లేదా పదవీకాలం ముగిస్తే వారిని అరెస్టు చేయొచ్చని వివరిస్తున్నారు.

# గోడు వినండి.. గొంతు తడపండి



ములుగు : ఇంటింటికీ స్వచ్ఛమైన తాగు నీరందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం ప్రజలకు వరం లాంటిదే. కానీ అసంపూర్తి పనులు, పైపుల లీకేజీలు, అప్రకటిత విద్యుత్తు కోతలు, సకాలంలో సరఫరా జరగక ప్రజలు తాగునీటికై ఇబ్బంది పడుతున్నారు. లీకేజీల కారణంగా కలుషిత తాగు నీటితో అనారోగ్యాలకు గురవుతున్నారు. వేసవి నేపథ్యంలో తాగు నీటి సమస్యపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు జాప్యం చేస్తున్నారు. పైపులైన్ల లీకేజీ, చేతిపంపుల మరమ్మతు లాంటి పనులను సైతం పట్టించుకోకపోవడంతో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నెలకొంటోంది. 52 గ్రామాలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నాయని జిల్లా అధికారులు గుర్తించారు. జిల్లాలో నెలకొన్న తాగునీటి సమస్యపై పరిశీలనాత్మక కథనం...

ములుగులో వీవర్స్ కాలనీ వెళ్లే క్రాసు రోడ్డు వద్ద చేతిపంపు సుమారు నెల రోజుల క్రితం పాడవ్వడంతో నిరుపయోగంగా మారింది. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో వచ్చే నీరు రెండ్రోజులకోసారి వస్తోంది. గతంలో నీటి సమస్య వచ్చిన ప్రతిసారి చేతి పంపు ఉపయోగపడేది. ప్రస్తుతం అది మరమ్మతుకి గురవ్వడంతో స్థానికులు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. చేతిపంపును మరమ్మతు చేయించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసిన స్పందన లేదని వారు చెబుతున్నారు. త్వరితగతిన తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

ఏటూరునాగారంలో తాగునీటికి కటకట

ఏటూరునాగారం మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో తాగునీటి సమస్య వేధిస్తోంది. జలసంపద పుష్కలంగా ఉన్నా మండలంలో కొన్ని ప్రాంతాల్లో తాగునీటి ఇక్కట్లు తప్పట్లేదు. మిషన్ భగీరథ నీళ్ల సరఫరా క్రమబద్ధంగా లేకపోవడంతో ప్రజల్లో ఆయోమయ పరిస్థితి నెలకొంది. ప్రధానంగా మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం, తాళ్లగడ్డ, క్రాస్ రోడ్డు ప్రాంతాల్లో భగీరథ నీళ్లు పది రోజులు వస్తే మరో పది రోజులు రావట్లేదు. గతంలో భగీరథ నీళ్లు వస్తున్నాయనే ఉద్దేశంతో ఉన్న చేతి పంపులను వాడటం మానేశారు. దీంతో అవి పనిచేయకుండా పోయాయి. ప్రస్తుతం భగీరథ నీరు రాక, చేతిపంపులు పనిచేయక ప్రజలు తాగునీటికై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశంపై మిషన్ భగీరథ ఏఈ మోహన్‌తో మాట్లాడగా సమస్య తమ దృష్టికి రాలేదని, వెంటనే మా సిబ్బందిని పంపించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు.

బోరుబావులను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు

మండలంలోని పొట్లాపూర్ గ్రామంలో వేసవి కాలంలో బోరుబావులు ఎండిపోతున్నాయి. మిషన్ భగీరథ నీరు పూర్తిగా రావడంలేదు. కొన్ని వీధులకు పైపులైన్లు వెయ్యలేదు. చేతివంపులు సైతం పనిచేయకపోవడంతో గామస్థులు తాగునీటికై తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సర్పంచి లత, పాలడుగుల రాకేష్, లౌడియ విజేందర్ తమ బోరుబావుల నుంచి గ్రామానికి తాగునీటిని అందిస్తున్నారు.

పది రోజులుగా నీళ్లు రావడం లేదు....

–తమ్మళ్ల మమత, క్రాస్‌రోడ్డు

పది రోజులుగా తాగునీటి సరఫరా లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. వేరే ప్రాంతాలకు వెళ్లి బిందెలతో నీళ్లు తెచ్చుకుంటున్నాం. ఫిర్యాదు చేద్దామంటే సంబంధిత అధికారులు అందుబాటులో ఉండట్లేదు. తాగునీటి సమస్యను గుర్తించి అధికారులు వెంటనే పరిష్కరించాలి.

సమస్యాత్మక గ్రామాల్లో చర్యలు తీసుకుంటున్నాం– సుభాష్ ఈఈ మిషన్ భగీరథ

జిల్లా వ్యాప్తంగా 52 గ్రామాలను తాగునీటి సమస్య ఉన్నవాటిగా గుర్తించాం. వేసవి నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఈ గ్రామాల్లో డీఎంఎఫ్‌టీ నిధుల కింద రూ. 2.89 కోట్లతో ప్రతిపాదనలు చేసి 28 గ్రామాల్లో సమస్య లేకుండా చేశాం. మిగిలిన గ్రామాల్లో తాగు నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. పైపులైన్‌ల లీకేజీలను కూడా అరికడుతున్నాం. ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా జిల్లాలో 21 బోర్లు, పైపులైన్లు వేసేందుకు నిర్ణయించాం. అందులో 10 బోర్లు పూర్తయ్యాయి. త్వరితగతిన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం.

# క్రీడా ప్రాంగణ ఏర్పాటులో నిర్లక్ష్యం

జగిత్యాల : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన క్రీడా ప్రాంగణాల ఏర్పాటులో అధికారుల నిర్లక్ష్యంతో లక్ష్యం చేరడం లేదు. పురపాలికల్లోని చిన్నారులు ఆటలు ఆడుకునేందుకు వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మెట్‌పల్లి బల్దియా పరిధిలోని 26 వార్డుల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని పట్టణ ప్రగతి నిధులు రూ. 30 లక్షలు కేటాయించారు. పట్టణంలో ప్రభుత్వ స్థలాల కొరతతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. ఇప్పటివరకు 13 మాత్రమే ఏర్పాటు చేశారు.

అవగాహన కరవు

ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణంలో వాలీబాల్ కోర్ట్, ఖోఖో, కబడ్డీ కోర్టులతో పాటు పలు రకాల వ్యాయామ పరికరాలు, లాంగ్‌జంప్, తదితర వాటిని




ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. స్థలాల కొరతతో పరికరాలు బిగించి వదిలేస్తున్నారు. ఆయా వార్డులలో ఏర్పాటు చేసిన ప్రాంగణాలపై అవగాహన కల్పించక పోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి.

గేట్‌వాల్వ్ గుంత

పట్టణంలో ఫిల్టర్‌బెడ్ వద్ద ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణంలో సగం వరకు ఫిల్టర్‌హౌజ్‌లు, గేట్‌వాల్స్, పెద్ద సంపు, ఉద్యోగులు ఉండే మూడు గదులు ఉంటాయి. ఇవన్నీ ఉండగా ఇక్కడే క్రీడాప్రాంగణం ఏర్పాటు చేశారు. ఇందులో వాలీబాల్ కోర్ట్ ఏర్పాటు చేశారు. దీనిని ఆనుకునే మిషన్ భగీరథ గేట్‌వాల్వ్ గుంత ఉండడంతో ఎలా ఆడాలని క్రీడాకారులు వాపోతున్నారు. కళానగర్‌లోని సరస్వతి శిశుమందిరం ప్రైవేటు పాఠశాలలో క్రీడాప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల ముగిసిన తర్వాత యాజమాన్యం గేట్‌కు తాళం వేసి వెళ్తారు. ఈ విషయంపై బల్దియా ఏఈ అరుణ్‌కుమార్‌ను వివరణ కోరగా క్రీడాప్రాంగణాలను వార్డుకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. స్థలాల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, స్థలాలు ఉన్నచోట్ల ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

# తాగునీటి సరఫరా అంతంతే..!



ములుగు : 'అన్ని ఉన్నా అల్లుడి నోట్లో శని ఉన్నట్లుగా తయారైంది నగరంలో తాగునీటి సరఫరా తీరు. ధర్మసాగర్ చెరువులో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయి. సరిపడా తాగునీటి శుద్ధీకరణ కేంద్రాలు, ప్రధాన, అంతర్గత పైపులైన్లు, సర్వీస్ రిజర్వాయర్లు(వాటర్ ట్యాంకులు) ఉన్నప్పటికీ నీరెందుకు ఇవ్వడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. మంత్రి కేటీఆర్ ఆదేశానుసారం నగరంలో నిత్యం తాగునీటి సరఫరాకు గ్రేటర్ వరంగల్, పబ్లిక్‌హెల్త్ ఇంజినీర్లు మల్లగుల్లాలు పడుతున్నారు. సరఫరా సాధ్యాసాధ్యాలను హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు విశ్రాంత సీఈ రవికుమార్ సమగ్ర అధ్యయనం చేస్తున్నారు. నగరంలోని 66 డివిజన్లలో 90 శాతం కాలనీలకు రోజూ నల్లా నీళు వస్తున్నాయని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే మరోలా ఉంది. 40–50 శాతం కాలనీలకు రోజూ, మిగిలిన 50 శాతం కాలనీలకు దినం విడిచి దినం సరఫరా జరుగుతుంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో క్షేత్రస్థాయిలో సమస్యలున్నాయని తెలిసింది. నగరంలో 66 డివిజన్లలో తాగునీటి సరఫరాను నాలుగు జోన్లుగా విభజించారు.

హనుమకొండ ప్రాంతంలో..హనుమకొండ వడ్డేపల్లి జోన్ పరిధిలో 70–75 శాతం నిత్యం నీటి సరఫరా చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాజీపేట విష్ణుపురి, ఎఫ్‌సీఐ రిజర్వాయర్ల పరిధిలో దినం విడిచి దినం సరఫరా అవుతుందంటున్నారు. పరిశీలిస్తే కాజీపేట దర్గా, ప్రశాంత్‌నగర్, సోమిడి, డీజిల్ కాలనీ, బాపూజీనగర్, హనుమకొండ వడ్డేపల్లి, ఎన్జీవోస్ కాలనీ, జులైవాడ, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో సమస్య ఎక్కువగా ఉంది. హనుమకొండ కేయూసీ జోన్ పరిధిలో 24 ట్యాంకులున్నాయి. విద్యారణ్యపురి, ముచ్చర్ల రిజర్వాయర్లు తప్ప మిగిలిన వాటిలో రోజూ నీటి సరఫరా ఉందంటున్నారు. విలీన గ్రామాలు, నయీంనగర్, కొత్తూరుజెండా, రెడ్డికాలనీ, పోచమ్మకుంట, ఈద్గా తదితర ప్రాంతాల్లో నీటి సమస్య ఉంది.

వరంగల్‌లో.. వరంగల్ దేశాయిపేట జోన్ పరిధి చాలా పెద్దది. 70–75 శాతం కాలనీలకు ప్రతిరోజు, మిగిలిన 25 శాతం దినం విడిచి దినం నీటి సరఫరా చేస్తున్నట్లుగా ఇంజినీర్లు చెబుతున్నారు. లేబర్ కాలనీ, ఎస్సార్టీ కాలనీ, గొర్రెకుంట కీర్తినగర్ రిజర్వాయర్ల పరిధిలోనే సమస్యలున్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఎల్బీనగర్, కాశీబుగ్గ, అబ్బనికుంట, గిర్మాజిపేట, జీఆఆర్‌గుట్ట, మండిబజారు, మట్టెవాడ, రామన్నపేట, పాపయ్యపేట, సంతోషిమాత కాలనీతో పాటు విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది. కొన్ని కాలనీలకు ట్యాంకర్ల ద్వారా నీళ్లు అందిస్తున్నారు.

అండర్ రైల్వేగేటు జోన్ పరిధిలో గత నాలుగైదేళ్లుగా రోజూ నల్లా ఇచ్చారు. రెండు, మూడు నెలలుగా పరిశీలిస్తే దినం విడిచి దినం సరఫరా జరుగుతుంది. పాత పైపులైన్లు, మిషన్ భగీరథ పైపులైన్లకు వేర్వేరుగా సరఫరా చేస్తున్నారు. ధర్మసాగర్ ఫిల్టర్‌బెడ్ నుంచి 60 మిలియన్ లీటర్ ఫర్ డే(ఎంఎల్‌డీలు) క్లియర్ వాటర్ ఇస్తున్నారు. కడిపికొండ, అమ్మవారిపేట వద్ద ప్రధాన పైపులైన్ వాల్వ్ ఆపరేటింగ్‌లో లోపం ఉంది. దీంతో వాటర్ ట్యాంకులు నిండటం లేదు. ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్‌తోట, శాంతినగర్, శివనగర్, ఖిలావరంగల్ కోట, చింతల్, పుప్పాలగుట్టతో పాటు విలీన గ్రామాల్లో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది.

క్షేత్రస్థాయిలో సమస్యలివే..కాలనీలకు నీటి సరఫరా వాల్వ్‌లు తిప్పేందుకు ఉద్యోగుల కొరత ఉంది. సర్వీస్ రిజర్వాయర్ల పంపింగ్ షెడ్యూల్ లేదు. కాలనీల్లో లీకేజీలు ఎక్కువగా ఉన్నాయి. మిషన్ భగీరథ కనెక్షన్ల ద్వారా నీటి వృథా ఎక్కువగా ఉంది. కొన్ని కాలనీలకు ఇంత వరకు నల్లా కనెక్షన్లు ఇవ్వలేదు. చేతి పంపులు, మినీ స్టాటిక్ ట్యాంకులు అపరిశుభ్రంగా ఉన్నాయి. లైన్లపై భారం పెరిగింది. ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్లు పట్టించుకోవడం లేదు.

ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశాం– ప్రవీణ్‌చంద్ర, పర్యవేక్షక ఇంజినీర్, నీటి సరఫరా విభాగం

నగరంలోని అన్ని డివిజన్ల పరిధిలోని కాలనీలకు 90 శాతం తాగునీటి సరఫరా జరుగుతుంది. చిన్నచిన్న సమస్యలున్నాయి. వాటిని కూడా అధిగమిస్తాం. లీకేజీలు యుద్ధప్రాతిపదికన అరికడుతున్నాం. వేసవిలో ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.

శుద్ధ జలాలు అందని ద్రాక్ష

నర్సంపేట పట్టణంలో పాత, కొత్తగా వెలిసిన ఎనిమిది కాలనీల్లో ప్రజలకు శుద్ధ జలాలు అందడం లేదు. దీంతో ఆయా కాలనీల్లోని ప్రజలు అవస్థలు పడుతున్నారు. 40 వేలకు పై చిలుకు జనాభా కలిగిన నర్సంపేట పట్టణంలో గత రెండున్నరేళ్ల నుంచి మిషన్ భగీరథ నీళ్లను పాత పైపులైన్లకు కనెక్షన్ ఇచ్చి సరఫరా చేస్తున్నారు. ఇప్పటి వరకు పైపులైన్లు లేని కొత్త కాలనీలు, కొన్ని పాత కాలనీల్లో ప్రజలకు శుద్ధ జలాల అందడం లేదు. రోజుకు 50 లక్షల లీటర్ల నీటిని ప్రజలకు సరఫరా చేస్తున్నా.. పూర్తిస్థాయిలో పైపులైన్ పనులు కానందున నీటికి ఇబ్బందులు తప్పడం లేదు.

రెండు నెలల్లో కనెక్షన్లు ఇస్తాం– వెంకటస్వామి, పుర కమిషనర్, నర్సంపేట

పట్టణంలో మిషన్ భగీరథ పైపులైన్ల నిర్మాణ పనులు 85 శాతం పూర్తయ్యాయి. మిగిలిన పనులతో పాటు ప్రధాన పైపులైన్ పనులు పూర్తి చేసి రానున్న రెండు నెలల్లో ఇంటింటికి శుద్ధ జలాలు అందిస్తాం.

# తీరనున్న తాగునీటి సమస్య


కరీంనగర్ : కొత్తగా ఏర్పాటైన మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు అధికారులు ప్రణాళికలు చేశారు. జిల్లాలో కరీంనగర్ నగరపాలక సంస్థతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్పదండి, కొత్తపల్లి మున్సిపాలిటీలున్నాయి. రెండు పురపాలికలు కొత్తగా ఏర్పాటు కావడంతో, మిగతా వాటిల్లో సమీప గ్రామాలను విలీనం చేయడంతో తాగునీటికి కటకట తప్పడం లేదు. కొత్తపల్లి మున్సిపాలిటీలో నల్లానీరు తాగడానికి కూడా పనికి రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. తాగునీటి వసతి మెరుగుపర్చాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నప్పటికీ నిధులు లేక ఇప్పటికీ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తోంది.

భగీరథలో జాప్యంవేసవిలో మున్సిపాలిటీలు, విలీన కాలనీల్లో రూరల్ మిషన్ భగీరథ కింద తాగునీరు రాక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నగరంలో 10 లక్షల లీటర్ల ట్యాంకు గంటన్నరలో నిండుతుండగా, రూరల్ మిషన్ భగీరథ ద్వారా నిర్మించిన లక్ష లీటర్ల ట్యాంకు 20 గంటలు పడుతుంది. దీంతో నీటి సరఫరాకు జాప్యం జరుగుతోంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల నగరపాలిక రూ. 5.50 కోట్లతో కొత్తగా తాగునీటి పైపులైను వేయగా అత్యధిక ప్రాంతాల్లో పనులు పూర్తి చేసి నీటి సరఫరాను మెరుగుపర్చారు. మిగతా భాగంలో పనులు కొనసాగుతు న్నాయి.

అంచనాలు తయారు

రోజు తాగునీరు సరఫరా చేసేందుకు అమృత్ కింద విలీన కాలనీలు, కొత్త మున్సిపాలిటీల్లో పైపులైన్లు, రిజర్వాయర్లు విస్తరించేందుకు ప్రతిపాదనలు చేశారు. రానున్న పాతికేళ్ల జనాభాను దృష్టిలో ఉంచుకొని ప్రజారోగ్యశాఖ అంచనాలు తయారు చేసింది. ప్రభుత్వం ద్వారా అనుమతి రాగానే టెండర్లు పిలిచే అవకాశముంది. ఈ పనులు ప్రారంభించిన ఏడాదిలోగా పూర్తి చేసి ఇంటింటా తాగునీరు సౌకర్యం కల్పించనున్నారు.

పనుల వివరాలు ఇలా.. కరీంనగర్ నగరపాలిక పరిధిలో 10 ఎంఎల్‌డీల ఫిల్టర్‌బెడ్‌ను ఆధునికీకరణ చేయనున్నారు. 1100కేఎల్ సామర్థ్యంతో వాటర్ సంపు నిర్మాణం, మూడు పంపుసెట్లు, 9.61



కిలోమీటర్లు రేకుర్తి వరకు పంపింగ్ లైన్, ఫీడర్ లైన్, పైపులైను విస్తరణ, పంపుహౌజ్ నిర్మాణం, 400కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ తదితర పనులున్నాయి.

కొత్తపల్లి మున్సిపాలిటీలో స్టోరేజీ రిజర్వాయర్, ఫీడర్, సరఫరా పైపులైన్ల విస్తరణ, 3ఎంఎల్‌డీ శుద్ధి కేంద్రం, ట్రాన్స్‌ఫార్మర్, ఇంటింటా నల్లా కనెక్షన్లు, మోటార్లు ఉన్నాయి.

హుజురాబాద్‌లో ఫీడర్‌మెన్స్, పైపులైన్ల విస్తరణ, ఇంటింటా నల్లా కనెక్షన్లు 2 వేల కేఎల్ రిజర్వాయర్, ప్రహరీ, క్వార్టర్స్ నిర్మాణ పనులున్నాయి. చొప్పదండిలో స్టోరేజీ రిజర్వాయర్, పైపులైన్ల విస్తరణ, ఇంటింటా నల్లా కనెక్షన్లు, పంపుహౌజ్, జనరేటర్, రెండు చోట్ల వెయ్యి కేఎల్ సామర్థ్యంతో రిజర్వాయర్లు, క్వార్టర్లు, కాంపౌండ్‌వాల్ వంటి పనులు ఉన్నాయి. జమ్మికుంటలో స్టోరేజీ రిజర్వాయర్, పైపులైను విస్తరణ, ఇంటింటా నల్లాలు, నల్లా సౌకర్యం లేని ప్రాంతానికి కొత్తగా లైన్లు వేయడం పనులు చేస్తారు.

పరిపాలన అనుమతి రావాలి

సంపత్‌రావు, ఈఈ, ప్రజారోగ్యశాఖ, కరీంనగర్

విలీన కాలనీలు, కొత్త మున్సిపాలిటీల్లో తాగునీటి వసతి కల్పించేందుకు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాం. పరిపాలన అనుమతి రాగానే ఈఎన్‌సీ స్థాయిలో టెండర్లు పిలుస్తారు.

# ఏడు నెలలకే కూలిన కాలువ

జగిత్యాల : రూ.లక్షలు ఖర్చు చేసి రహదారులు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తుండగా.. అవి మూణ్నాళ్లు కూడా ఉండడంలేదు. పనుల సమయంలో అధికారుల తనిఖీలు లేకపోవడంతో నాణ్యత లోపిస్తోంది. ఏళ్ల తరబడి పక్కాగా ఉండాల్సిన మురుగునీటి కాల్వలు ఏడాది తిరగకముందే కూలుతున్నాయి. డ్రైనేజీలు, రహదారుల నిర్మాణ సమయంలో అక్కడ ఎలాంటి భూమి ఉందో పరిగణనలోకి తీసుకోవడం లేదు.

మొదట్లో బయటపడిన లోపం

అలకాపురికాలనీ రోడ్డు నంబర్ 3లో ఈ ఏడాది జనవరి రెండో వారంలో కొత్తగా సీసీ డ్రైనేజీ నిర్మించారు. ఆ సమయంలోనే ఓ ఇంటి దగ్గర పగుళ్లు రావడంతో పనుల లోపాలు బయటపడ్డాయి. ఆ సమయంలో కొద్ది దూరంలో పగుళ్లు పట్టడం, ఒక వైపు ఒరగడంతో ఆ మేర తొలగించి తిరిగి స్టీల్ వేసి నిర్మించారు. ఆ తర్వాత మిగతా భాగం బాగానే ఉందని వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షాలకు భూమి పూర్తిగా నాని అడుగు భాగం నుంచి కాల్వలోని రోడ్డు సైడ్ గోడ పడిపోయింది. ఆగమేఘాల మీద పడిపోయిన సిమెంటు దిమ్మెలు



తొలగించి అక్కడ కొత్తగా డ్రైనేజీ నిర్మించేలా చదును చేసి పెట్టారు. నిర్మించి ఏడు నెలల్లోనే కూలడంతో నాణ్యత ఏవిధంగా ఉందో అర్థమవుతుంది. కొత్తగా నిర్మించిన డ్రైనేజీ రెండు సార్లు కూలిందని, నాణ్యత ప్రమాణాలు పాటించని గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని ప్రయోజనాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త మహ్మద్ అమీర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇతర చోట్ల పనులు చేయకుండా బ్లాక్ లిస్టులో పెట్టాలని, ధ్రువీకరణ జారీ చేసిన ఏజెన్సీ స్థానంలో కొత్త ఏజెన్సీని నియమించాలని కోరారు.

ఇవేం ధ్రువీకరణలు

నగరాభివృద్ధిలో భాగంగా పలు ప్రాంతాల్లో చేపడుతున్న పనులకు ఎప్పటికప్పుడు క్వాలిటీ కంట్రోల్ తనిఖీ చేసి నమోదు చేస్తుండగా అంతటా సవ్యంగా ఉన్నాయనే ధ్రువీకరణలు వస్తున్నట్లుగా చెబుతున్నారు. అలాంటప్పుడు గతేడాది జూన్ నుంచి ఈ ఏడాది జులై వరకు పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు ఒక వైపు వంగడం, కూలిపోవడం వంటి ఫిర్యాదులు వచ్చాయి. రూ.లక్షలు ఖర్చు చేసి రోడ్లు, మురుగునీటి కాల్వలు నిర్మిస్తుండగా అధిక శాతం గుత్తేదారులు క్యూరింగ్ చేయడంలేదు. నామమాత్రంగా ఒకటెండ్రు రోజులు నీటిని చల్లించి స్థానికులకే అప్పగిస్తున్నారు. మూడు పూటల నీరు పట్టే వారు లేకుండా పోతున్నారు.

మళ్లీ నిర్మాణం

అలకాపురి కాలనీలో పైనుంచి వరద ఉద్ధృతంగా రావడం, డ్రైనేజీ కింది నుంచి పైపు ఉండటం, భారీ వాహనాలు వెళ్లడంతో ఒక వైపు డ్రైనేజీ గోడ ఒరిగింది. మొత్తం తొలగించి కొత్తగా నిర్మించేందుకు చర్యలు చేపట్టాం. ఓంప్రకాశ్, డీఈఈ, నగర పాలక సంస్థ

# ఆకృతిలో లోపాలు.. నాణ్యతపై అనుమానాలు

వేములవాడ : భూగర్భ జలాలను పెంపొందించాలనే ఉద్దేశంతో మూలవాగులో నిర్మించిన చెక్‌డ్యాంల కరకట్టలు వరద ఉద్ధృతికి కొట్టుకుపోయాయి. ఫలితంగా వాటిలో నీరు నిలిచే పరిస్థితి లేదు. పైగా చెక్‌డ్యాంల పక్కనున్న వందలాది ఎకరాల పంట పొలాలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆకృతి(డిజైన్)లో లోపాలు, వీటి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతోనే పంట పొలాలు దెబ్బతిన్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలోని వీర్నపల్లి మండలంలో ప్రారంభమైన మూలవాగు కోనరావుపేట, వేములవాడ గ్రామీణ మండలం, వేములవాడ పట్టణ సమీపం నుంచి వెళ్లి శ్రీరాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో కలుస్తుంది. ఈ మూలవాగులో మూడేళ్ల క్రితం దాదాపు రూ.65 కోట్లతో 13 చెక్‌డ్యాంల నిర్మాణ పనులను నీటిపారుదలశాఖ అధికారులు చేపట్టారు. ఇందులో వేములవాడ గ్రామీణ మండలంలోని మల్లారం, బొల్లారం, జయవరం, వేములవాడ పట్టణం, తిప్పాపూర్, వేములవాడ శివారు మహాలక్ష్మివీధి, వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి, కోనరావుపేట మండలంలోని మర్రిమడ్ల, వట్టిమల్ల, వెంకటాపూర్, కనగర్తి, మామిడిపల్లి, కొండాపూర్ చెక్‌డ్యాంల నిర్మాణ పనులు ఏడాది క్రితమే పూర్తయ్యాయి. వేములవాడ గ్రామీణ మండలంలోని జయవరం, లింగంపల్లి వద్ద చెక్‌డ్యాంల మట్టి కరకట్ట పనులు ఇటీవల పూర్తి చేశారు. భారీ వర్షాలకు మూలవాగు ఇరువైపులా ఒడ్డులను ఆనుకొని వరద ముంచెత్తింది. దీంతో చెక్‌డ్యాంల సైడ్ కరకట్టలన్నీ తెగిపోయాయి. పక్కనున్న రైతుల పంట పొలాలను వరద ముంచెత్తింది. దీంతో వందలాది ఎకరాల పంట పొలాలు దెబ్బతినడంతో పాటు పెద్ద ఎత్తున పంట చేలు కోతకు గురై రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. అంచనాకు మించి ప్రవాహంతో..ఇటీవల కురిసిన వర్షాలకు నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారుల అంచనాకు మించి మూలవాగులో వరద ప్రవహించింది. భవిష్యత్తులో వచ్చే వరద ప్రవాహాన్ని అధికారులు అంచనా వేయకుండానే చెక్‌డ్యాంల డిజైన్ చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఒక్కటీ నిలవలేదు. మూలవాగులో నిర్మించిన అన్నింటికీ వరద తాకిడి ఏర్పడింది. చెక్‌డ్యాంలను ముంచెత్తిన నీరు పక్కనున్న కరకట్టలపై నుంచి ప్రవహించడంతో కోతకు గురయ్యాయి. కొన్నింటికి సైడ్ సిమెంట్ గోడలు పక్కకు జరిగాయి. డిజైన్‌కు మించి ప్రవాహం రావడం వల్లే సైడ్ కరకట్టలు తెగిపోయినట్లు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదన్న ఆరోపణలున్నాయి. చెక్‌డ్యాంలకు జరిగిన నష్టంపై ఇప్పటికే ప్రాథమికంగా అంచనా వేసి అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు.

వందల ఎకరాల్లో పంటలకు నష్టంమూలవాగు వెంబడి నిర్మించిన చెక్‌డ్యాంల కరకట్టలు తెగిపోవడం వల్ల వాటి పరీవాహక ప్రాంతాల్లోని పంట పొలాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వరి, పత్తి పంట చేలు కోతకు గురయ్యాయి. వేములవాడ గ్రామీణ మండలం లింగంపల్లిలోని ప్రకృతి వనం, క్రీడా ప్రాంగణం, శ్మశాన వాటిక తదితర వాటితో పాటు  కొట్టుకుపోయి భారీ నష్టం ఏర్పడింది.

# బడి.. వరద దాడి



వరంగల్ : జిల్లాలో భారీ వర్షాల కారణంగా వారం రోజుల పాటు సెలవుల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. వర్షాలు తగ్గినా పాఠశాలల్లో వరద ఆనవాళ్లు ఇంకా ఉన్నాయి. పాఠశాలల ఆవరణ, తరగతి గదుల్లోకి వర్షం నీళ్లు చేరడతో అంతా బురద, మట్టి పేరుకుపోయి అపరిశుభ్రత నెలకొంది. కొన్ని చోట్ల ఇప్పటికీ తరగతి గదుల్లో నీళ్లు నిలిచి ఉన్నాయి. పలుచోట్ల పాత భవనాలు శిథిలావస్థకు చేరడంతో వర్షానికి తడిచి ప్రమాదకరంగా ఉన్నాయి. కొన్ని తరగతి గదులు పెచ్చులూడి పడుతుండటంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. స్కావెంజర్లు, స్వీపర్లు లేకపోవడంతో వరండాలు, తరగతి గదులను శుభ్రం చేయించడం సమస్యగా మారింది. వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని, చిన్నచిన్న సమస్యలుంటే స్థానికంగానే పరిష్కరించుకోవాలని సూచించినట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు కేటాయించలేదని చెప్పారు.ఇది నర్సంపేట పట్టణం పాకాల రోడ్డు (సర్వాపురం)లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల. ఒకటి నుంచి ఐదు తరగతులున్న బడిలో బాలురు 21, బాలికలు 29 మంది ఉన్నారు. ఎప్పుడో నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. ఇటీవల ఏకధాటిగా కురిసిన వర్షాలకు వరద నీరంతా భవనంలోకి చేరడంతో తరగతి గదులు బురద పేరుకుపోయి అపరిశుభ్రంగా మారాయి. అసలే శిథిలావస్థకు చేరిన భవనం వర్షాలకు తడిసి ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులను చెట్ల కిందట కూర్చోబెట్టి బోధన చేస్తున్నారు. పాఠశాల భవనం పరిస్థితిపై కిందటి నెలలో 'వేళ్లానుకున్న నిర్లక్ష్యం' శీర్షికన 'ఈనాడు'లో కథనం కూడా ప్రచురింతం అయింది. విద్యార్థులను జడ్పీఎస్ఎస్ మోడల్ పాఠశాలలోకి మారుస్తామని అధికారులు చెప్పడంతో అప్పట్లో వార్డు కౌన్సిలర్, సర్వాపురం ప్రజలు తాము రేకుల షెడ్డు నిర్మిస్తామని చెప్పి రాత పూర్వకంగా హామీ ఇచ్చి నెల రోజులైనా అది కార్యరూపం దాల్చలేదు.ఇది నర్సంపేట పట్టణం ద్వారకపేటలోని ప్రభుత్వ పాఠశాల. గతంలో ఏడు తరగతుల వరకు ఉండేది. క్రమంగా విద్యార్థుల సంఖ్య తగ్గడంతో ఐదవ తరగతి వరకే కుదించారు. ప్రస్తుతం 25 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల భవనం చుట్టూ వరద ప్రవాహంతో బురదగా మారింది. పాత భవనం కావడంతో అక్కడక్కడ కొంత ఉరుస్తోంది. ప్రస్తుతం ఆవరణలో ఓవైపు బురద ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కేవలం ఎనిమిది మంది చిన్నారులు మాత్రమే హాజరయ్యారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని తొలగించి, కొత్తది నిర్మించాల్సిన అవసరం ఉంది.

ఇది హంటర్‌రోడ్డు సంతోషిమాత కాలనీలోని ఆర్యవైశ్య ఉన్నత పాఠశాల తరగతి గది. మొత్తం 60 మంది విద్యార్థులు ఉన్నారు. ఇటీవల ఈ ప్రాంతాన్ని వరద ముంచెత్తడంతో పాఠశాలలోకి నీళ్లు చేరి బురద, మట్టి పేరుకుపోయి అపరిశుభ్రంగా మారింది. బెంచీలపై మట్టి పేరుకుపోయి కూర్చోవడానికి ఇబ్బందికర పరిస్థితి ఉంది. విద్యార్థులు పెట్టుకున్న పాఠ్య, నోట్ పుస్తకాలు తడిచిపోయాయి. కింద తరగతి గదుల్లో బురద, మట్టి పేరుకు పోవడంతో పైఅంతస్తులో తరగతులు నిర్వహిస్తున్నారు.గీసుకొండ మండలంలోని కొమ్మాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 48 మంది విద్యార్థులు ఉండగా.. 26 మంది మాత్రమే హాజరయ్యారు. ఎడతెరిపి లేని వర్షాలకు పాఠశాల భవనంపై నీళ్లు నిలిచి స్లాబ్ దెబ్బతినింది. ప్రయోగశాల గదితోపాటు వరండాలో పెచ్చులూడడంతో వర్షాలకు ఉరుస్తోంది. దీంతో విద్యార్థులను ప్రయోగశాలలోకి అనుమతించడం లేదు. వరండా అంతా పెచ్చులూడి వర్షం నీళ్లు నిలిచాయి. విద్యార్థులను వరండాలో నుంచి కాకుండా వేరే మార్గం గుండా తరగతి గదుల్లోకి పంపిస్తున్నారు. స్లాబ్ పైభాగంలో మరమ్మతులు చేసి వర్షానికి ఉరువకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

ఆవరణలో విద్యార్థినులు కూర్చొని ఉన్న ఈ చిత్రం వరంగల్ స్టేషన్‌రోడ్డులోని కృష్ణాకాలనీ ప్రభుత్వ బాలికల కళాశాలలోనిది. ఈ ఆవరణలో బాలికల ఉన్నత పాఠశాల, జూనియకర్ కళాశాల కొనసాగుతున్నాయి. సుమారు 300 మంది చదువుకుంటున్నారు. ఇటీవల వరదలకు తరగతి గదులు మునిగిపోయాయి. విద్యాసంస్థలు తిరిగి ప్రారంభం కావడంతో సిబ్బంది బురద తొలగించి శుభ్రం చేయడంలో నిమగ్నమయ్యారు. తరగతి గదులు, ఆవరణలో ఇంకా వర్షం నీరు నిలిచి ఉంది. దుర్వాసన కారణంగా విద్యార్థినులను కళాశాల వెనుకవైపు ఆవరణలో కూర్చోబెట్టారు.

# కుంటుబడిన చదువులు



ములుగు: అధిక వర్షాల కారణంగా వారం రోజుల పాటు సెలవులు ప్రకటించిన ప్రభుత్వం ఎట్టకేలకు సోమవారం పాఠశాలలను తెరిచింది. వర్షాలకు బడుల భవనాలు మరింత ప్రమాదకరంగా మారాయి. నిరంతరంగా కురిసిన వర్షాలతో పురాతన పాఠశాలల పైకప్పు పెచ్చులు ఊడి పడుతున్నాయి. దీంతో విద్యార్థులు వరండాలో కూర్చుని విద్యనభ్యసిస్తున్నారు. మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులు కూడా అసంపూర్తిగా ఉండడంతో ఆ పాఠశాలల విద్యార్థులు కూడా  వరండాలోనే కూర్చుని చదువుతున్నారు.ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా మన ఊరు మన బడి కార్యక్రమం చేపట్టింది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో అభివృద్ధి పనులు గత మే నెలలోనే పూర్తి చేసి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలని లక్ష్యంగా పెట్టుకునప్పటికీ అసంపూర్తిగానే మిగిలిపోయాయి. పాఠశాలలు ప్రారంభమై రెండున్నర నెలలు దాటినా ముందుకు సాగడం లేదు. పాఠశాలల మరమ్మతులు, నూతన గదుల నిర్మాణాల పనులకు నిధుల కొరత వెంటాడుతుండటమే ఇందుకు కారణం. రూ.30 లక్షల లోపు పనులను పాఠశాల యాజమాన్య కమటీలు చేస్తుండగా ఆ పై వ్యయమయ్యే వాటిని గుత్తేదార్లు దక్కించుకున్నారు. పనులు మాత్రం పూర్తి చేయడం లేదు. ప్రస్తుతం జరుగుతున్న తీరును చూస్తే మరో ఆరు నెలల వరకు కూడా పూర్తవుతాయనే నమ్మకం కుదరడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ విద్యా సంవత్సరంలోనూ విద్యార్థులు అష్టకష్టాలు పడాల్సిందే.

125 పాఠశాలల్లో పనులు

ములుగు జిల్లాలో మొత్తం 348 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. మొదటి విడతలో రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి కింద ములుగు జిల్లాలో 125 పాఠశాలలను ఎంపిక చేసింది. మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణం తదితర పనులు చేస్తున్నారు. ఇందులో 77 ప్రాథమిక పాఠశాలలు, 17 ప్రాథమికోన్నత పాఠశాలలు, 33 ఉన్నత పాఠశాలలున్నాయి. జిల్లాలో మొత్తం 9 మండలాలుండగా ఒక్కో మండలంలో 4 పాఠశాలలను ఎంపిక చేసి మాడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించి వాటిని ఎట్టకేలకు పూర్తి చేశారు.

వరండా చదువులు....

పాఠశాల: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ఎక్కడ: ములుగు, అటవీ శాఖ కార్యాలయం ఎదురుగా

విద్యార్థుల సంఖ్య: 112

హాజరైన విద్యార్థులు: 37

ప్రస్తుత పరిస్థితి: మన ఊరు.. మన బడి కింద నిధులు కేటాయించారు. పనులు అసంపూర్తిగా ఉన్నాయి. తరగతి గదులు అందుబాటులో లేక 2, 3 తరగతుల విద్యార్థులు వరండాలో కూర్చుని విద్య అభ్యసిస్తున్నారు. 1, 4, 5 తరగతులకు మాత్రమే తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. గుత్తేదారు తన ఇష్టం వచ్చినట్లు మెటీరియల్ వదిలి వెళ్లాడు. పాఠశాల ఆవరణ అస్తవ్యస్తంగా ఉంది. ఈదురు గాలులతో వర్షం వస్తే వరండాలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు పరుగులు పెట్టడమే దిక్కు.

ఎలా బాగు చేయవచ్చు: మన ఊరు మన బడి కింద కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకొని ఎలాంటి జాప్యం చేయకుండా సత్వరమే పనులు పూర్తి చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవు.

శిథిలమైన భవనం...

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

ములుగు వీవర్స్ కాలనీ

24 5 ఒకే తరగతి గది. భవనం శిథిలావస్థకు చేరింది. అధిక వర్షాలకు గది గోడలు, స్లాబు తడి ఏర్పడింది. అక్కడక్కడ పైకప్పు పెచ్చులు ఊడుతున్నాయి. అవి ఎప్పుడు ఎవరిమీద పడతాయో తెలియని పరిస్థితి. పరిస్థితి బాగా లేకపోడంతో విద్యార్థులను వరండాలో కూర్చోబెట్టి ఉపాధ్యాయుడు చదువు చెబుతున్నారు.

పైకప్పు భాగం ఒక లేయర్ సిమెంటుతో చదును చేయాలి. గది లోపలి భాగంలో ఊడుతున్న పెచ్చులను తొలగించి ఒక లేయర్ సిమెంటుతో  చదును చేయాలి. లేదంటే అదనపు తరగతిని కొత్తగా నిర్మించాలి.

# దరఖాస్తుకు పడిగాపులు

జగిత్యాల : దివ్యాంగులకు ఆసరా పింఛన్ మొత్తాన్ని పెంచుతూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీచేయగా ఇతర కేటగిరీలకు చెందిన లబ్ధిదారులు తమకూ పింఛన్ మొత్తం పెంచటంపై ఆశగా ఉన్నారు. రాష్ట్రప్రభుత్వం 2018 డిసెంబరులో రెండోసారి అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి 2022 అక్టోబరు వరకు నూతన పింఛన్ల నిమిత్తం జిల్లాలోని 36 వేల మంది దరఖాస్తు చేయగా ఇందులో నుంచి 22 వేలమందికి మంజూరిచ్చారు. తదుపరి కనీసం దరఖాస్తులకు వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించనందున గతంలో వివిధ కారణాలతో పింఛన్లు మంజూరుగానివారితో పాటుగా 57 సంవత్సరాలు నిండినవారు 27 వేల మందివరకు దరఖాస్తు చేసేందుకు ఎదురు చూస్తున్నారు. బీడీ కార్మికుల సంఖ్యాపరంగా రాష్ట్రంలోనే



నిజామాబాద్ తరువాత జగిత్యాల జిల్లా నిలుస్తోంది. బీడీ కార్మికుల పీఎఫ్ కటాఫ్ తేదీని కేవలం నిజామాబాద్ జిల్లాలో మాత్రమే సవరించి పింఛన్లను మంజూరివ్వగా జగిత్యాల జిల్లాలోనూ అవకాశం కల్పిస్తే దాదాపుగా 21 వేల మందికి బీడీకార్మిక పింఛన్లు వస్తాయి. ప్రస్తుతం జిల్లాలో 2,27,944 మందికి ప్రతినెల రూ.47.68 కోట్ల వరకు వస్తుండగా అన్ని విభాగాలకు చెందినవారికి నెలకు రూ.2,016 చొప్పున, దివ్యాంగులకు రూ.3,016 చొప్పున ఇస్తున్నారు. దివ్యాంగులకు పింఛన్ మొత్తాన్ని రూ.4,016కు పెంచగా 17,328 మందికి పెరిగిన పింఛన్ మొత్తాన్ని చెల్లించనున్నారు. ఈ నేపథ్యంలో దివ్యాంగుల మాదిరిగా తమకూ పింఛన్ మొత్తాన్ని పెంచాలని ఇతర విభాగాలకు చెందిన పింఛన్ లబ్ధిదారులు కోరుతున్నారు.

# ఆన్‌లైన్‌లో.. యాదాద్రీశుల ఆర్జిత పూజల బుకింగ్

యాదగిరిగుట్ట :దేవుడి దర్శనం.. పూజల్లో సులభంగా పాల్గొని మొక్కు తీర్చుకునే అవకాశాలు ఆన్‌లైన్ ద్వారా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానం రెండేళ్ల కిందట మొదలైనా తెలంగాణ రాష్ట్రావిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈ ఏడాది జూన్ 22 నుంచి పూర్తిస్థాయిలోకి అమల్లోకి తీసుకొచ్చారు. వైటీడీఏ ఆధ్వర్యాన ఈసీఐఎల్ పర్యవేక్షణలో ఆన్‌లైన్‌లో ఆర్జిత పూజల బుకింగ్ విధానం కొనసాగుతోంది.

వెబ్‌సైట్‌లో ఈ–సేవలు

యాదాద్రిలో నిత్యపూజల టిక్కెట్లను వెబ్‌సైట్ ద్వారా అందుబాటులో ఉంచారు.'%yadadritemple.telangana.gov.in% అనే వెబ్‌సైట్‌లో సదరు సేవలు పొందొచ్చు. ఇందులో నిజాభిషేక (ఇద్దరికి రూ.800, ఒక్కరికి రూ.400), సహస్రనామార్చన రూ.300, శ్రీ సుదర్శన నారసింహ హెూమం రూ.1250, స్వామి వారి కల్యాణం రూ.1500, శయనోత్సవం రూ.100, స్వర్ణపుష్పార్చన రూ.600, సుప్రభాత దర్శనం రూ.100, దర్బార్ సేవ రూ.516, అష్టోత్తర ఘటాభిషేకం రూ.1000, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం రూ.800, ద్విచక్ర వాహన పూజ రూ.300, ఆటో రూ.400, కారు రూ.600, బస్సు, లారీ, ట్రాక్టర్ - రూ.1000, శాశ్వాత నిత్యపూజ (పదేళ్లు) రూ.10 వేలు, శాశ్వత నిత్య నిజాభిషేకం (పదేళ్లు) రూ.15 వేలు, శాశ్వత నిత్య సహస్రనామార్చన (పదేళ్లు) రూ.15 వేలుగా నిర్ణయించారు. రాత్రి బస చేసే భక్తుల కోసం కొండకింద గదులు ఉన్నాయి. లక్ష్మీ నిలయం నాన్ ఏసీ రూ.560, లక్ష్మీ నిలయం నాన్ ఏసీ డీలక్స్ రూ.1008గా నిర్ణయించారు.

బ్రేక్ దర్శనం టిక్కెట్లు



తిరుమల తరహాలో యాదాద్రిలో బ్రేక్ దర్శనాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఒక్కొక్కరికి టికెట్ ధర రూ.300. దీన్ని ఖరీదు చేసిన భక్తులను ఉత్తర రాజగోపురం ద్వారా ఆలయం లోపలికి అనుమతి ఇస్తారు. ఉదయం 9 నుంచి 10 వరకు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఈ దర్శన సదుపాయం కల్పిస్తున్నారు. బ్రేక్ దర్శనంలో గర్భాలయ ప్రవేశం ఉంటుంది.

రూ.150 శ్రీఘ్రదర్శనం టికెట్లను ఆన్‌లైన్‌లో పొందొచ్చు.

ఆలయంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు, ఇతర వాటికి విరాళాలు ఇచ్చేందుకు ఈ–విరాళం సదుపాయం కల్పించారు. హుండీలలో కానుకలను సమర్పించేందుకు ఈ–హుండీ సైతం అందుబాటులో ఉంది. ప్రధానాలయం దివ్య విమాన గోపురాన్ని స్వర్ణమయం చేసేందుకు ఆన్‌లైన్‌లో వితరణ చేసే వీలుంది.

ఆన్‌లైన్ బుకింగ్‌లో పేరు, పూజ వివరాలు, గోత్రం మొబైల్ నంబరు, మెయిల్ ఐడీ, తేదీ, ఎన్ని టికెట్లు, వెల, చిరునామా తప్పనిసరిగా నమోదు చేయాల్సి ఉంటుంది. ఆప్షనల్‌గా నక్షత్రం, రాశీ, ఆధార్ నంబర్, వయసు, ఆలయం సందర్శన వేళల వివరాలు తెలుపాల్సి ఉంటుంది. ఒక వ్యక్తి ఒక సారి మాత్రమే టిక్కెట్ బుక్ చేసుకునేలా పరిమితి విధించారు. ట్రాన్సాక్షన్ ఐడీ లేదా మొబైల్ నంబర్ ద్వారా సేవా రిపోర్టుల ప్రింట్ కూడా తీసుకునే అవకాశం ఉంది.

# ఓటర్ల జాబితాల పునఃపరిశీలన

ఖమ్మం : కొద్దినెలల్లో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 2023 జనవరి 5న ప్రకటించిన తుది ఓటర్ల జాబితాను ప్రామాణికంగా తీసుకొని ఓటర్ల వివరాలను పునఃపరిశీలించాలని కలెక్టర్లకు ఎన్నికల సంఘం ఇటీవల సూచించింది. ప్రధానంగా గత ఏడాది కాలంలో తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి తనిఖీ చేయాలని ఆదేశించింది.

మొదలైన ప్రక్రియ ఏటా జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం ప్రకటిస్తుంది. 2022 జనవరిలో ప్రకటించిన తుది ఓటర్ల జాబితా ఆధారంగా అదే సంవత్సరం అక్టోబర్ నుంచి ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కొత్తగా ఓటర్ల నమోదు, తొలగింపు, సవరణల ప్రక్రియ పూర్తి చేసి 2023 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. ఈ సమయంలో ఖమ్మం జిల్లాలో 29,550 మంది ఓటర్ల పేర్లు తొలగించారు. ఇందులో మరణించినవారు కొందరైతే.. రెండు లేదా అంతకంటే ఎక్కువ నియోజకవర్గాల్లో ఓటర్లుగా నమోదైన వారు మరికొందరు ఉన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ సమయంలో బీఎల్వోలు ఇంటింటికీ వెళ్లి తగిన ఆధారాలతో కొందరి పేర్లను జాబితాల నుంచి తొలగించారు. ఇదే సమయంలో ఎన్నికల సంఘం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఫొటో సిమిలర్ ఎంట్రీలను గుర్తించి జిల్లాలకు జాబితాలు పంపించింది. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఒకచోట మాత్రమే పేరు కొనసాగించాలని, మరోచోట జాబితాల నుంచి తొలగించాలని ఉ



న్నతాధికారులు సూచించారు. కొందరు బీఎల్వోలకు సరైన అవగాహన లేకపోవటంతో వేర్వేరు పోలింగ్ కేంద్రాలు, నియోజకవర్గాల్లో నమోదైన పేర్లను తొలగించారు. కొంతమంది ఓటర్లు రెండుచోట్లా జాబితా నుంచి తొలగింపునకు గురై ఓటుహక్కు కోల్పోయారు. ఈ విషయాన్ని గుర్తించిన ఎన్నికల సంఘం.. జాబితాల నుంచి తొలగించిన ఓటర్ల వివరాలను మరోసారి పునఃపరిశీలించాలని ఆదేశించింది. తగిన ఆధారాలతో అర్హులకు ఓటుహక్కు కల్పించాలని స్పష్టం చేసింది. జిల్లాలో పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ల జాబితాల పునఃపరిశీలన ప్రక్రియ మొదలైంది. రెండుచోట్లా పేర్లు తొలగింపునకు గురైనవారు 377 మంది ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ ప్రక్రియను నియోజకవర్గ ఈఆర్వో (ఎలక్టోరల్ రోల్ ఆఫీసర్), సహాయ ఈఆర్వోలైన తహసీల్దార్లు పర్యవేక్షిస్తున్నారు. జిల్లా ఎన్నికల అధికారి అయిన కలెక్టర్ తనిఖీ చేయనున్నారు.

# శుద్ధజలానికి సాక్ష్యం



ఖమ్మం : చిన్నారులకు పౌష్టికాహారం, ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్యను అందించాలని ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. చిన్న పిల్లల నడవడికలో మార్పు తెచ్చి ఇక్కడ అక్షరాలు నేర్పుతున్నారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందిస్తున్నారు. ఇప్పుడు ఆయా కేంద్రాలకు త్వరలో శుద్ధజలం అందనుంది. తొలుత సొంత భవనాలున్న కేంద్రాల్లో మినీ ఆర్వోప్లాంట్లు ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో వాటి వివరాలను సేకరించారు. ఉభయ జిల్లాల్లో ఇందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో ఏడు ఐసీడీఎస్ ప్రాజెక్టులు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పదకొండు ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి పరిధిలో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా మరికొన్ని అద్దెభవనాల్లో నడుస్తున్నాయి. ఇంకొన్ని ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్ని కేంద్రాల్లో పూర్తిస్థాయిలో తగిన వసతులు లేవు. దీంతో కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 'సాక్ష్యం' పథకంలో భాగంగా మినీ ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ముందుగా సొంత భవనాలు, పిల్లల సంఖ్య అధికంగా ఉన్న కేంద్రాలకు ప్రాధాన్యమివ్వనుంది. అవసరమైన లీటర్ల సామర్థ్యం మేరకు ప్లాంట్లు స్థాపించనుంది. అనంతరం విడతల వారీగా మిగిలిన కేంద్రాల్లో ఆర్వో ప్లాంట్లను సమకూర్చనుంది.

పరిశీలించి ఎంపిక చేస్తాం

సంధ్యారాణి, జిల్లా సంక్షేమ అధికారి

జిల్లాలో సొంత భవనాలున్న అంగన్‌వాడీ కేంద్రాలకు తొలి ప్రాధాన్యం ఇచ్చి మినీ ఆర్వో ప్లాంట్లకు ఎంపిక చేయనున్నాం. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా రూ.లక్ష అందించనుంది. ఈ నిధులతో ఆర్వోప్లాంట్లతో పాటు కేంద్రాల్లో అవసరమైన వసతులను సమకూర్చనున్నాం. ఇప్పటికే పరిశీలన ప్రక్రియ మొదలైంది. ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరలోనే జాబితా రూపొందిస్తాం.

# గుట్టుగా తరలుతున్న ఖనిజం..!

మహబూబాబాద్ : కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినా అక్రమార్కులు బైరటీస్ తరలింపు మానడం లేదు.. కంచెను ఛేదించుకొని మరీ అక్రమానికి పాల్పడుతున్నారు. గార్ల మండలం పోచారం, బాలాజీతండా, కోట్యానాయక్‌తండా పంచాయతీ పరిధిలో మూతపడిన బైరటీస్ మైనింగ్ ప్రాంతాల నుంచి కొంత మంది అక్రమార్కులు ఖనిజాన్ని రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రాత్రి అయితే చాలు విలువైన ఖనిజం ఉన్న గుట్టకు చేరుకొని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి సమయంలో భద్రతను పెంచి ఖనిజం తరలింపునకు చెక్ పెట్టాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడేళ్ల నుంచి ..

ఈ ముడి ఖనిజాన్ని పెట్రోల్ శుద్ధి, రంగుల తయారీ, తదితరాలకు వినియోగిస్తారు. దీనిపై అక్రమార్కులు కన్నుపడింది. సుమారు వంద ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఈ మైనింగ్ ప్రాంతానికి వాహనాలు వెళ్లకుండా అటవీశాఖ అధికారులు తవ్విన కందకాలను సైతం పూడ్చి ఖనిజాన్ని దోచుకుంటున్నారు. మూసేసే సమయంలో గుట్టపై అక్కడక్కడ వదిలేసిన ఖనిజ కుప్పలను కాజేస్తున్నారు. మూడేళ్ల కిందట బైరటీస్‌ను ఆ ప్రాంతంలోని ఓ వ్యక్తి ట్రాక్టర్ ద్వారా అక్రమంగా



తరలిస్తుండగా అటవీశాఖ అధికారులకు పట్టుబడ్డాడు. ఇటీవల కొంత మంది అక్రమార్కులు ఇష్టారాజ్యంగా తరలిస్తున్నట్లు సమాచారం. రాత్రి వేళల్లో టిప్పర్ల, ట్రాక్టర్ల ద్వారా కాకినాడకు పంపిస్తున్నారు. అక్కడి నుంచి వారు అనుకున్న చోటుకు చేర్చుతున్నారు. టిప్పరు ఖనిజాన్ని రూ. 8 లక్షలకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

పరిశ్రమ పునరుద్ధరిస్తే

పాలకులు, అధికారులు ప్రత్యేక చొరవ చూపి పరిశ్రమ పునరుద్ధరణ చేపట్టాలి. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా నిరుద్యోగులకు ఉపాధి లభించే అవకాశాలు ఉన్నాయని వారిని దృష్టిలో పెట్టుకుని పునరుద్ధరించాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తగిన చర్యలు తీసుకుంటాం-రమేశ్, డీఆర్వో

రాత్రి పూట నిఘా ఉండేలా వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయాలంటూ జిల్లా ఉన్నతాధికారులకు ప్రతిపాదన పంపించాం. ఎవరైనా ఖనిజాన్ని అక్రమంగా తరలిస్తే గుర్తించి చర్యలు తీసుకుంటాం. అవసరమైతే పట్టుబడిన వారి యొక్క భూమికి సంబంధించిన పట్టాదారు పాసుపుస్తకాలను స్వాధీనం చేసుకుంటాం. కేసులు నమోదు చేస్తాం.

# జెండా పాట.. నష్టాల మూట..!



ఖమ్మం : ఖమ్మం మార్కెట్‌లో మిర్చి రైతులు దగా పడుతూనే ఉన్నారు. పలికిన జెండా పాటకు ఏకంగా రూ.5వేలు తగ్గించి వ్యాపారులు మిరపను కొనుగోలు చేయటంతో అన్నదాతలు లబోదిబోమన్నారు. గిట్టుబాటు ధర దొరుకుతుందనే కొండంత ఆశతో మార్కెట్‌కు వస్తే కొనుగోళ్ల మాయాజాలంతో నష్టాల మూట గట్టుకుని తిరుగుపయనమయ్యారు.

నెల రోజులుగా ఇదే తంతు..!

ఖమ్మం విపణికి నెల రోజులుగా మిర్చి రాక క్రమేణా పెరుగుతూ వస్తోంది. ఇటీవల ఒకరోజు మార్కెట్‌కు అత్యధికంగా సుమారు 70 వేల బస్తాల మిర్చిని రైతులు తీసుకొచ్చారు. మంగళవారం దాదాపు 50 వేల బస్తాల సరకు వచ్చింది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతో పాటు నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, కృష్ణా, గుంటూరు జిల్లాల నుంచి మిరపకాయలను రైతులు తీసుకొచ్చారు. మార్కెట్ అధికారులు జెండా పాటను రూ.23వేలు, నమూనా రకం మిర్చికి రూ.21వేలు, కనిష్ఠ ధర రూ.18వేలుగా నిర్ణయించారు. ధరలను వ్యాపారులు అమాంతం తగ్గించటంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చింది. నాణ్యత, తేమ శాతాన్ని సాకుగా చూపి వ్యాపారులు రూ.18వేల నుంచి రూ.21వేల వరకు కొన్నారు. అత్యధిక మంది రైతులు క్వింటాకు రూ.5 వేల వరకు నష్టపోయారు.

మోసగించటమే ఎ'జెండా'..

మార్కెట్‌లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయన్న నమ్మకంతో వస్తే.. ఇక్కడ కొనుగోళ్లు సాగుతున్న తీరుతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు కన్నీరుమున్నీరయ్యారు. సాకులు చూపుతూ ధరలు అమాంతం తగ్గించేస్తున్నారని వాపోయారు. ఇటీవల జెండా పాట అత్యధికంగా రూ.25వేల వరకు పలికింది. ఈనెల 11న రూ.24,500, 13న రూ.23,700, 17న రూ.23,500 పలికిన ధర మంగళవారం రూ.23వేలకు పరిమితమైంది. అసలే జెండా పాట దక్కడం లేదన్న బాధతో ఉంటే.. రోజురోజుకూ జెండా పాట పడిపోతుండటం రైతులను మరింత కుంగదీస్తోంది. చేసేదేమీ లేక వ్యాపారులు అడిగిన ధరకే సరకును విక్రయిస్తూ నష్టాలు మూటగట్టుకుని వెనుదిరుగుతున్నారు.

పది క్వింటాళ్ల మిర్చి తీసుకొచ్చాను. జెండా పాట ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాట ధర దక్కలేదు. అనేక సాకులు చెప్పి ధర రూ.18,700గా నిర్ణయించారు. తీసుకొచ్చిన మిర్చితో మళ్లీ ఇంటికి వెళ్లలేక అమ్మేశాను. మంచి ధర దక్కుతుందని చాలాదూరం నుంచి వస్తే చివరకు నష్టమే మిగిలింది. వీరబోయిన యలమంచి, సర్వారం, మోతె మండలం, సూర్యాపేట జిల్లాఖమ్మం మార్కెట్‌లో మిర్చి ధర ఆశాజనకంగా ఉందని అద్దె వాహనంలో 20 బస్తాల సరకు తెచ్చాను. ఒక్కో బస్తాకు రూ.100 రవాణా ఖర్చు అయింది. తీరా ఇక్కడికి వచ్చాక జెండా పాట రూ.23వేలు ఉంటే.. నా మిర్చి రూ.19వేలు మాత్రమే పలికింది. నాణ్యత కలిగిన సరకే అయినా ఒక్కో క్వింటాకు రూ.4వేలు తగ్గించి కొనటంతో తీవ్రంగా నష్టపోయాను. జగన్మోహన్‌రావు, మిరప రైతు, జగ్గయ్యపేట

# కొత్త వారికి అవకాశం లేదు!

జగిత్యాల : పెంపకందారులకు రాయితీపై గొర్రెల యూనిట్లను పూర్తిస్థాయిలో అందించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 22,674 మంది గొర్రెల కాపరులను గుర్తించగా వీరిలో 292 సంఘాల పరిధిలో 21,067 మందికి రాయితీపై గొర్రెలను ఇవ్వాలని సంకల్పించారు. ఇందులోనూ తొలివిడతలో 2017-18 ఆర్థిక సంవత్సరంలో 10,557 మందిని ఎంపికచేయగా 9,756 మంది డీడీలను తీసిచ్చి గొర్రెలను తీసుకున్నారు. డీడీలు తీసివ్వనందున 801 మందికి గొర్రెలను పంపిణీ చేయలేదు. జిల్లాలో రెండో విడతలో 10,510 యూనిట్లను గుర్తించగా 7,694 మంది డీడీలను తీసిచ్చారు. వీరిలో 5,198 మందికి యూనిట్లను పంపిణీ చేసిన తరువాత 2018 చివర్లోనే పథకాన్ని ఆపివేశారు. 21 గొర్రెలతో కూడిన ప్రతి యూనిట్ పూర్తిధర రూ. 1.25 లక్షలుండగా



ప్రభుత్వ రాయితీ రూ.93,750 పోను లబ్ధిదారులు రూ.31,250 చొప్పున చెల్లించారు. పథకాన్ని ఆపివేసే సమయానికే జిల్లాలో 2,496 మంది తమవంతు మొత్తాన్ని చెల్లించారు. కాగా రెండేళ్లక్రితం యూనిట్ ధరను రూ.1.75 లక్షలకు పెంచటంతో మిగిలిన 2,496 మంది ఒక్కో యూనిటుకు తమవంతుగా మళ్లీ రూ.12,500 చొప్పున అదనంగా రూ.3.12 కోట్లను చెల్లించాల్సి వచ్చింది. వీరికి గొర్రెల యూనిట్లను పంపిణీ చేశారు. జిల్లాలో రెండోవిడతలో 2,816 మంది డీడీలను తీసివ్వలేదు.

ప్రస్తుతం రూ.1.75 లక్షల యూనిట్ విలువలో రూ.43,750 మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన రూ.1,31,250 రాయితీగా ఉంది. జిల్లాలో రెండు విడతల్లో కలిపి 3,617 మంది గొర్రెలు అందని వారున్నట్లుగా అధికారులు గుర్తించి ప్రస్తుతం వీరినుంచి డీడీలను తీసుకుంటుండగా ఇప్పటివరకు 250 మంది వరకు తమవంతు వాటా మొత్తానికి డీడీలు తీసిచ్చారు. మరోవైపు 2017 సంవత్సరంలో ఎంపికచేసిన జాబితాలోని వారికే ప్రస్తుతం అవకాశం ఇస్తున్నారు. నూతనంగా పెంపకందారులకు పథకంలో అవకాశం కల్పించనందున దాదాపుగా 1,500 మంది వరకు నిరాశగా ఉన్నారు. ఐదేళ్లక్రితం తక్కువ ధరలో గొర్రెలు తీసుకున్నవారికి ఇప్పటిదాకా మంద పెంపు జరగగా తాము అధికధర చెల్లించాల్సి రావటం, ఐదేళ్లు ఆలస్యంగా గొర్రెలను ఇవ్వటంతో లబ్ధికలగదని, రాయితీని పెంచాలని పెంపకందారులు కోరుతున్నారు. మరోవైపు గత విడతల్లో పలుచోట్ల పంపిణీ అవకతవకలు జరగగా ఈ సారి పక్కాగా పంపిణీ చేయాల్సిఉంది. 2017 జాబితాలోని దాదాపు 50 మంది వరకు మృతిచెందగా వీరి భార్య లేదా కుమారులను పథకంలో చేర్చేందుకు జిల్లా కలెక్టర్‌కు నివేదిస్తున్నట్లు పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ గోపాలకృష్ణమూర్తి తెలిపారు. జాబితాలోగల మిగిలినవారు తమవంతు వాటా మొత్తానికి డీడీలను తీసివ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఎలాంటి అవకతవకలు జరగకుండా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటకలనుంచి గొర్రెలను తెచ్చి లబ్ధిదారులకు అందించనున్నట్లు వివరించారు.

# చిన్నారులకు 'చిరు'విందు ఇద్దాం!

వరంగల్ : వేసవి సెలవులు రాగానే పిల్లలకు అమ్మలు, నాన్నమ్మలు, అమ్మమ్మలు అనేక రకాల వంటకాలు చేసి పెడుతుంటారు. ఇన్నాళ్లూ చదువుకొని కష్టపడ్డారని.. సెలవుల్లో వారు కోరుకునే వంటలు వండి వార్చాలని ఆరాటపడతారు. ఒకటి, రెండు రోజులు నూనె పదార్థాలతో చేసే ఆహార పదార్థాలు ఫర్వాలేదు. సుమారు 40 రోజులపాటు వరుసగా ఉన్న సెలవుల్లో పిల్లల కోసం ప్రత్యేక భోజన మెనూ తయారు చేయాల్సిందే. రుచితో పాటు అవి చిన్నారుల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావం చూపిస్తున్నాయని చూడాలి. ఆటపాటలతో అలసట చెందే వారికి తగిన క్యాలరీలు అందే ఆహారాన్ని అందించడం శ్రేయస్కరం. ఈ క్రమంలో ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే 'చిరుధాన్యాలు' (మిల్లెట్లు) భోజనంలో భాగం చేయాలి. 'చిప్స్, కూల్‌డ్రింకులు, ఐస్‌క్రీమ్‌లు, ఇతర చిరుతిళ్ల స్థానంలో చిరుధాన్యాలతో చేసుకోగల వంటకాలు అనేకం ఉన్నాయి. ఈ సెలవుల్లో విద్యార్థులకు వీటి ప్రాధాన్యం తెలియజేయాలి.

ఇలా చేద్దాం..పిల్లలు సహజంగా పౌష్టికాహారం కన్నా రుచిగా ఉంటేనే ఎక్కువ ఇష్టపడతారు. మిల్లెట్లకు విలువ జోడించకుండా వండి పెడితే తినడానికి ముందుకు రారు. పండ్లతో ఐస్‌క్రీమ్‌లను తయారుచేయొచ్చు. కొందరు పిల్లలు పాలు ఎక్కువగా ఇష్టపడతారు.. అలాంటి వారికి చిరుధాన్యాలతో పాలలాంటి పదార్థాలను అందించొచ్చు. రాగులను రాత్రి నానబెట్టుకొని ఉదయం రుబ్బేసి అందులో నీళ్లు పోస్తే రాగి పాలు అవుతాయి. ఈ పాలల్లో ఒక పండు ముక్కను కలిపి మిక్సీ పడితే మిల్లెట్ స్మూతీ తయారవుతుంది. వీటిని పిల్లలు ఇష్టంగా ఆరగిస్తారు. సజ్జల్లాంటివి నానబెట్టి మొలకలు వచ్చాక వాటిని స్నాక్స్‌లా తినొచ్చు. మరింత రుచికరంగా ఉండాలంటే మొలకల్లో ఉల్లిపాయలు వేసి, నిమ్మకాయ పిండి చిన్నారులకు ఉదయం అల్పాహారంగా, సాయంత్రం స్నాక్స్‌గా ఇవ్వొచ్చు. పల్లీపట్టీలు, నువ్వుల ముద్దల్లో సైతం సామలు వేసి మిల్లెట్ చిక్కీలు చేయొచ్చు. సాధారణ బెల్లం కన్నా తాటి బెల్లంతోనూ వీటిని వండుకోవచ్చు. ఆటలాడి అలసిపోయి వచ్చిన పిల్లలకు వీటిని ఇస్తే బలవర్ధకంగాఉంటుంది.

రైతులకు ప్రోత్సాహం

ఐరాస 2023ను అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. మన ప్రాంతంలో వీటిని పండించే వారి సంఖ్య చాలా తక్కువ. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం 'రాష్ట్రీయ కృషి వికాస్ యోజన' పథకంలో చిరు ధాన్యాలను పండించేందుకు 'మిల్లెట్స్ ప్రోగ్రాం' కింద హెక్టారుకు రూ. 6 వేల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వనుంది. ఇటీవల వ్యవసాయ శాఖకు ఈ పథకంపై మార్గదర్శకాలు వచ్చాయి. హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో మొదటి దఫాలో సుమారు 340 ఎకరాల చొప్పున చిరు ధాన్యాలను పండించేందుకు అధికారులు రైతులను గుర్తించారు.

అనేక రకాలుగా మేలు- డాక్టర్ రేపాల అనూష, డైటీషియనిస్ట్, ఏకశిలా ఆసుపత్రి, హనుమకొండ

చిరుధాన్యాలతో అనేక రకాల ఆహార పదార్థాలను ఇంట్లో తక్కువ ధరకు తయారుచేసుకోవచ్చు. రాగి ఫ్లేక్స్, జొన్న పేలాలు, మిల్లెట్ ప్రోటీన్ పౌడర్, మొలకలు వచ్చిన వాటిని స్నాక్స్‌గా తినొచ్చు. వీటిని క్రమం తప్పకుండా పిల్లలతో తినిపిస్తే వారికి ఆరోగ్యంతో పాటు అనేక రకాలుగా మేలు జరుగుతుంది.

# చెప్పేదొకటి.. ఇచ్చేదొకటి..!



ఇల్లెందు : భగభగమండే ఎండల్లో రెక్కలు ముక్కలు చేసుకుంటూ బొగ్గు గనుల్లో సింగరేణి అద్దె వాహనాల మోటరు కార్మికులు విధులు నిర్వర్తిస్తున్నారు. అయినా వారి శ్రమకు తగిన వేతనం అందటం లేదు. సింగరేణి యాజమాన్యం టెండర్ ద్వారా నడిపిస్తున్న బొలెరోలు, క్యాంపర్లు, నీటి ట్యాంకర్లు, అంబులెన్స్‌లు, లారీల వంటి అద్దె వాహనాలకు డ్రైవర్లుగా పనిచేస్తున్న మోటరు కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇస్తున్నా.. బిల్లులు మంజూరై యజమాని నుంచి డ్రైవర్ చేతికి అందేసరికి వేతనాలు కోతలకు గురవడం పరిపాటిగా మారిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సింగరేణి వ్యాప్తంగా అద్దె వాహనాల మోటరు కార్మికులకు చెల్లించాల్సిన వేతనాల్లో గాడీల యజమానులే కక్కుర్తి పడుతుండటం గమనార్హం. డ్రైవర్ల ఏటీఎం కార్డులను వాహనాల యజమానులు తమ దగ్గర ఉంచుకుంటున్నారంటే తీవ్రతను అర్థం చేసుకోవచ్చు. నెల రోజులకు చెల్లించాల్సిన వేతనం.. బిల్లు మంజూరై డ్రైవర్ చేతికి అందే వరకు సుమారు 50 రోజులు పడుతోంది. ఈ విధంగానూ డ్రైవర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ధైర్యం చేసి తమ గోడు వినిపిద్దామనుకుంటే మరుసటి రోజు విధుల నుంచి తొలగిస్తారేమోననే భయం వారిని వెంటాడుతోంది. ప్రత్యామ్నాయ మార్గం లేక చాలీచాలని వేతనంతోనే విధులు నిర్వర్తిస్తున్నారు.సింగరేణి యాజమాన్యం అద్దె వాహనాల డ్రైవర్లను స్కిల్డ్ కార్మికులుగా గుర్తించింది. రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తే రూ.671 వేతనమిస్తుంది. ఇలా నెలలో 26 రోజులు ఎనిమిది గంటలు విధులు నిర్వర్తించే వారికి రూ.17,446 చెల్లిస్తుంది. అయితే వాహన యజమానులు మాత్రం ఆ వేతనంలో కోతలు పెడుతూ.. ఎనిమిది గంటలు పనిచేసే కార్మికుడికి రూ.12వేల నుంచి రూ.13వేలు మాత్రమే చెల్లిస్తున్నారు. రోజుకు 12 గంటలు విధులు నిర్వర్తించే వారికి నెలకు రూ.26,156 చెల్లించాల్సి ఉండగా రూ.18 వేలు మాత్రమే ఇస్తున్నారని డ్రైవర్లు వాపోతున్నారు.ఇవీ డ్రైవర్ల సమస్యలు.. నెలకు 26 రోజులు డ్యూటీ చేయాల్సి ఉన్నా 30 రోజులు విధులకు హాజరవ్వాల్సిన పరిస్థితి.వాహన యజమానులు యాక్టింగ్ డ్రైవర్లను నియమించడం లేదు.బోనస్‌లు, యూనిఫామ్స్ లేవు.వీటీసీ, మెడికల్ చెకప్ ఖర్చులను డ్రైవర్లే భరిస్తున్నారు. ప్రతినెలా 1న అందాల్సిన వేతనం.. పది నుంచి 20 రోజుల తర్వాత అందుతోంది.సింగరేణి అద్దె వాహనాల డ్రైవర్లకు స్కిల్డ్ వేతనాలు అందజేస్తున్నాం. వారి వేతనాల్లో కోతలుంటాయనే విషయం మా దృష్టికి రాలేదు. మోటరు కార్మికులు ఫిర్యాదు చేస్తే పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. షాలేము రాజు, ఏరియా జీఎం, ఇల్లెందు

# రెండు నెలలైనా తేలని ప్రీతి అంశం

వరంగల్ : కాకతీయ మెడికల్ కళాశాల మొదటి సంవత్సరం (అనస్తీషియా) వైద్యవిద్యార్థిని డాక్టర్ దారావత్ ప్రీతి ఆత్మహత్యకు సంబంధించిన కేసు ఇప్పటి వరకు ఎటూ తేలలేదు. గత ఫిబ్రవరి నెల 22న ఎంజీఎం ఆసుపత్రిలోని అత్యవసర శస్త్రచికిత్స విభాగంలోని విశ్రాంతి గదిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గదిని అదే రోజు మట్టెవాడ పోలీసులు సీజ్ చేసి విచారణ చేస్తున్నారు. పలుమార్లు స్వయంగా పోలీసు కమిషనర్ ఏవీ రంగనాథ్ ప్రీతి పడిపోయిన గదిని పరిశీలించి విచారణ చేశారు. సంఘటన జరిగి 56 రోజులవుతున్నా.. ఇప్పటి వరకు కేసులో ఏలాంటి పురోగతి కనిపించకపోగా, మట్టెవాడ పోలీసులు సీజ్ చేసిన గది తాళాలను తొలగించి ఎంజీఎం అధికారులకు అప్పగించారు. ఈ కేసును పోలీసులు ఎటు తేల్చకుండానే గది తాళాలను ఎంజీఎం అధికారులకు అప్పగించడంపై వైద్యవర్గాలు, గిరిజన సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన గదిని సీజ్ చేసిన పోలీసులు తాళాలు ఆసుపత్రి అధికారులకు అప్పగించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో ఇప్పటివరకు పోలీసులు ఏం చేశారని పలువురు ప్రశ్నిస్తున్నారు. పీజీలు, సిబ్బందికి అత్యవసర చికిత్స కోసం ఆ గది అవసరమైనదని, అందుకే తాళాలు అప్పగించినట్లు మట్టెవాడ పోలీసులు పేర్కొన్నారు.

## ఆర్-5 జోన్ ఇళ్ల నిర్మాణాలపై న్యాయపోరాటమే.. హైకోర్టు తీర్పుపై సుప్రీంకు జగన్ ప్రభుత్వం






గుంటూరు: పేదల ఇళ్ల నిర్మాణంపై న్యాయపోరాటం చేయాలనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఆర్-5 జోన్ ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ఇవాళ ఏపీ హైకోర్టు వెల్లడించిన తీర్పుపై సుప్రీం కోర్టుకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. రాజకీయ కుట్రలు, కోర్టు కేసుల ఆటం కాలు దాటుకుని ఇటీవలే అమరావతిలోని ఆర్-5 జోన్‌లో సీఎం జగన్ చేతుల మీదుగా పట్టాలు అందజేయించి మరీ ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది ప్రభుత్వం. అయితే ఇళ్ల నిర్మాణాన్ని ఆపేలా కుట్రపూరితంగా కొన్ని వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ నేపథ్యంలో గురువారం హైకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఇళ్ల నిర్మాణాలు నిలిపివేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. స్టే ద్వారా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఏపీ హైకోర్టు విధించిన స్టేను జగన్ సర్కార్ సవాల్ చేయనుంది.

## ఆంధ్రప్రదేశ్ అప్పులపై మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి క్లారిటీ



అమరావతి: వైకాపా హయాంలో కేవలం 3 శాతమే అప్పులు పెరిగాయని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. ఎఫ్ఆర్‌బీఎం, విద్యుత్ సంస్కరణల అమలుతో అదనపు రుణాలకు అనుమతి లభించిందన్నారు. నాలుగేళ్లలో రెవెన్యూ రాబడి కూడా 16.7 శాతం పెరిగిందన్నారు. వైకాపా వచ్చాక రాష్ట్ర స్థూల ఉత్పత్తి రూ.11 లక్షల కోట్లకు చేరిందని పేర్కొన్నారు. డిస్కమ్‌లతో పాటు ఇప్పటివరకు రూ.7వేల కోట్ల అప్పు తీర్చామన్నారు. రాష్ట్రం ఇచ్చిన లెక్కలన్నీ కాగ్, ఆర్‌బీఐ ధ్రువీకరించినవే అని బుగ్గన స్పష్టం చేశారు. ప్రజాపద్దులకు సంబంధించి వైకాపా ప్రభుత్వం రూ.3,471 కోట్లు బకాయిపడిందన్నారు. పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించినట్లు రాష్ట్ర అప్పులు రూ.4.42 లక్షల కోట్లు మాత్రమేనని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం అనుమతించినప్పటికీ రూ.28,466 కోట్లు అప్పు తీసుకోలేదని చెప్పారు. ఉద్యోగుల పీఎఫ్, ఇతర డిపాజిట్లు వాడుకున్న మాట వాస్తవమే అని బుగ్గన వెల్లడించారు.





విశాఖ: అమరావతిలో ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణంపై ఏపీ హైకోర్టు స్టే విధించడంపై తెదేపా ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ట్విటర్ వేదికగా స్పందించారు. మొదటినుంచి ఎన్నిసార్లు చెబుతున్నా.. పట్టించుకోకుండా ముందుకెళ్తే ఇలానే ఎదురుదెబ్బలు తగులుతాయన్నారు. "మీ స్వార్థ రాజకీయ కక్షలతో రాజధాని నిర్మాణాన్ని సర్వనాశనం చేశారు. అమాయక రైతుల జీవితాలతో ఆడుకోవాలని చూశారు. అమరావతి మాస్టర్ ప్లాన్‌లో ఎలక్ట్రానిక్ సిటీగా పేర్కొన్న ప్రాంతంలో కనీస పరిజ్ఞానం లేకుండా ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని చూశారు. మీ ప్రయత్నాలను ఈరోజు హైకోర్టు తప్పు పట్టి నిర్మాణాలపై స్టే విధించింది. ఆర్-5 జోన్‌లో ఇళ్ల నిర్మాణాన్ని వెంటనే నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసి చెంపదెబ్బ లాంటి తీర్పు ఇచ్చింది. మీకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే పేదలకు పట్టాలు ఇవ్వదల్చుకుంటే.. ఆర్-5 జోన్ పరిధిలో లేనివాటిని ఇచ్చి మీ విశ్వసనీయత చాటుకోండి. అంతే కానీ పేదల సంక్షేమం ముసుగులో అమరావతి మాస్టర్ ప్లాన్‌ను ధ్వంసం చేయొద్దు. చట్టాలు మీకు చుట్టాలు కావనే సత్యాన్ని గ్రహించి ఇప్పటికైనా నెత్తికెక్కిన మీ కళ్లను కిందకు దించండి" అని గంటా ట్వీట్ చేశారు.




కోటా: రాజస్థాన్‌లోని కోటాలో విద్యార్థుల వరుస ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. రెండు, మూడు వారాలకు ఒక ఆత్మహత్య కేసు నమోదవుతోంది. ఈ క్రమంలో మెడికల్ ప్రవేశ పరీక్షకు సిద్ధమవుతోన్న మరో విద్యార్థి కూడా బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతడిని ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మన్‌జ్యోత్ గుర్తించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 17 మంది విద్యార్థులు ప్రాణాలు తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. ఉత్తర్‌ప్రదేశ్ రామ్‌పుర్‌కు చెందిన మన్‌జ్యోత్ ఛబ్రా.. మెడికల్ ఎంట్రాన్స్ ఎగ్జామ్ శిక్షణ కోసం ఈ ఏడాది జనవరిలో కోటాకు వచ్చాడు. నీట్ కోచింగ్ తీసుకుంటున్న అతడు.. గురువారం ఉదయం తన హాస్టల్ రూమ్‌లో విగతజీవిగా కనిపించాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. వివిధ ఎంట్రెన్స్ టెస్టులు, పోటీపరీక్షల కోచింగ్ సెంటర్లకు ప్రసిద్ధి చెందిన 'కోటా'లో.. పొరుగు రాష్ట్రాల నుంచి ఏటా వేల మంది విద్యార్థులు శిక్షణ పొందుతారు. ఈ ఏడాది దాదాపు 2.5లక్షల మంది అక్కడ శిక్షణ తీసుకుంటున్నట్లు అంచనా. ఈ క్రమంలోనే అక్కడ విద్యార్థులు ఆత్మహత్యలు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది 15 మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడగా.. ఈ ఏడాది ఇప్పటికే ఆ సంఖ్య 17కు చేరడం గమనార్హం. అంతకుముందు కూడా పదుల సంఖ్యలో ఆత్మహత్యలు చోటుచేసుకున్నాయి. వీటితోపాటు అనేక ఘటనల్లో విద్యార్థులు ఆత్మహత్యకు యత్నించిన సందర్భాలూ ఉన్నాయి. అయితే, ఒత్తిడితోనే ఇలా బలవన్మరణానికి పాల్పడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

## ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌ల దిగుమతులపై.. కేంద్రం ఆంక్షలు



దిల్లీ: విదేశాల నుంచి ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, పర్సనల్ కంప్యూటర్ల దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. తక్షణమే ఇవి అమల్లోకి వస్తాయని వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే, దీనికి కొన్ని మినహాయింపులు కూడా ఇచ్చింది. సరైన అనుమతులు ఉంటే.. వాటిని దిగుమతి చేసుకునేందుకు వీలు కల్పించనున్నట్లు తెలిపింది. "హెచ్ఎస్ఎన్ 8741 కింద దిగుమతి చేసుకునే ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్లెట్లు, వ్యక్తిగత కంప్యూటర్లు, అల్ట్రా స్మాల్ ఫామ్ ఫ్యాక్టర్ కంప్యూటర్లు, సర్వర్లపై ఆంక్షలు విధిస్తున్నాం" అని వాణిజ్య, పరిశ్రమల శాఖ వెల్లడించింది. అయితే, బ్యాగేజీ రూల్స్ కింద చేసుకునే దిగుమతులకు ఈ ఆంక్షలు వర్తించబోవని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. బ్యాగేజీ రూల్స్ అంటే.. దేశంలోకి ప్రవేశించే ప్రతి ప్రయాణికుడి లగేజీని కస్టమ్స్ అధికారులు తనిఖీలు చేస్తారు. దీని ప్రకారం.. విదేశాల్లో ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు కొనుగోలు చేసి కస్టమ్స్ వద్ద సరైన ధ్రువపత్రాలు చూపిస్తే వాటిని అనుమతిస్తారు. ఇక ఈ కామర్స్ పోర్టల్స్‌లో కొనుగోలు చేసి పోస్ట్ లేదా కొరియర్ ద్వారా దిగుమతి చేసుకునే ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లు, కంప్యూటర్లకు ఈ ఆంక్షల నుంచి మినహాయింపు కల్పించినట్లు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అంతేగాక, రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్, బెంచ్‌మార్కింగ్, మరమ్మతులు, రీ-ఎక్స్‌పోర్ట్, ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ కోసం దిగుమతి చేసుకునే వాటికి కూడా ఈ ఆంక్షలు వర్తించబోవని పేర్కొంది. అయితే, ఇలా దిగుమతి చేసుకునే వాటిని ఎట్టి పరిస్థితుల్లో విక్రయించకూడదని స్పష్టం చేసింది. ఇలా దిగుమతి చేసుకున్న ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌లను పనిపూర్తయిన తర్వాత ధ్వంసం చేయడమో లేదా తిరిగి ఎగుమతి చేయడమో చేయాలని సూచించింది.




## కంచరపాలెం రైతుబజార్‌లో టమాటా కోసం పోటెత్తిన జనం

విశాఖ: కంచరపాలెం రైతుబజార్‌లో టమాటా కోసం జనం పోటెత్తారు. పది రోజులుగా రాయితీ టమాటా ఇవ్వకపోవడంతో ఒక్కసారిగా ప్రజలు తరలివచ్చారు. రైతుబజార్‌లో రాయితీ ధరపై కిలో టమాటా రూ.50కి విక్రయిస్తున్నారు.




## పింఛను డబ్బు జూదంలో పోగొట్టి.. కట్టుకథతో అడ్డంగా దొరికిన వాలంటీరు?

ఉరవకొండ : వృద్ధులకు ఇవ్వాల్సిన పింఛను డబ్బుతో జూదమాడి ఆ డబ్బును గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి ఎత్తుకెళ్లినట్లు కట్టుకథ అల్లిన గ్రామ వాలంటీరు పోలీసుల విచారణలో అడ్డంగా దొరికిపోయాడు. ఈ సంఘటన అనంతపురం జిల్లా విడపనకల్లులో బుధవారం వెలుగుచూసింది. మండలకేంద్రం విడపనకల్లుకు చెందిన ఓ గ్రామవాలంటీరు ఈనెల 1న మధ్యాహ్నం పింఛన్లు పంచడానికి అధికారులనుంచి రూ.89 వేల నగదు తీసుకెళ్లాడు. ఆ నగదుతో కర్నూలు జిల్లా గుమ్మనూరు సమీపంలోని జూద శిబిరంలో మంగాపత్త ఆడాడు. నగదు పాటు తన బంగారు ఉంగరం, సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. విషయం బయటపడకుండా కట్టుకథతో పోలీసులను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించాడు. తాను పింఛన్లు పంచడానికి నగదుతో వెళుతుండగా జాతీయ రహదారిపై ఇద్దరు వ్యక్తులు తనను ఆపి రూ.20 వేల నగదు ఇస్తే ఆ మొత్తాన్ని ఫోన్‌పే చేస్తామని చెప్పగా, తాను రూ.వెయ్యికి రూ.పది కమీషన్ ఇవ్వాలని కోరినట్లు చెప్పుకొచ్చాడు. ఒప్పుకున్న ఆ వ్యక్తులు కర్ణాటక సరిహద్దులోని ఓ గ్రామానికి తీసుకెళ్లి బెదిరించి నగదుతోపాటు, ఉంగరం, సెల్‌ఫోన్ లాక్కెళ్లారని ఈనెల 1న తండ్రితో కలిసి ఫిర్యాదు చేశాడు.

పోలీసులు విచారించగా అసలు విషయం బయటపడింది. ఈ విషయం బయటకు రాకుండా రాజకీయ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలున్నాయి.




అలహాబాద్: కాశీ విశ్వనాథ ఆలయ సమీపంలోని జ్ఞానవాపి మసీదులో శాస్త్రీయ సర్వే వ్యవహారంపై అలహాబాద్ హైకోర్టు కీలక ఉత్తర్వులు వెలువరించింది. మసీదు ఆవరణలో సర్వే కొనసాగించేందుకు భారత పురావస్తు శాఖకు అనుమతినిచ్చింది. ఈ మేరకు వారణాసి కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ మసీదు కమిటీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. న్యాయ ప్రయోజనాల కోసం శాస్త్రీయ సర్వే చేపట్టడం అవసరమని తీర్పు వెలువరిస్తూ కోర్టు వ్యాఖ్యానించింది. జ్ఞానవాపి మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని వారణాసి జిల్లా కోర్టు జులై 21న తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు భారత పురావస్తు విభాగ అధికారుల బృందం జులై 24న సర్వే ప్రారంభించింది. దీన్ని వ్యతిరేకిస్తూ మసీదు కమిటీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం సర్వేపై రెండు రోజుల పాటు స్టే విధించింది. వారణాసి కోర్టు తీర్పుపై మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టుకు వెళ్లొచ్చని సూచించింది. ఈ నేపథ్యంలోనే వారణాసి కోర్టు తీర్పును సవాల్ చేస్తూ మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. ఏఎస్ఐ సర్వేపై స్టే విధించి తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. తాజాగా మసీదు కమిటీ పిటిషన్‌ను కొట్టివేస్తూ బుధవారం తీర్పు వెలువరించింది. తక్షణమే సర్వే ప్రారంభించేందుకు ఏఎస్ఐకి అనుమతినిచ్చింది. హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో నేటి నుంచి మళ్లీ మసీదు ప్రాంగణంలో ఏఎస్ఐ బృందం సర్వేను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. మొగల్ కాలంలో హిందూ ఆలయ స్థానంలో ఈ మసీదు నిర్మించారని, ఈ విషయాన్ని సర్వే నిర్వహించి తేల్చాలని కోరుతూ నలుగురు హిందూ మహిళలు పిటిషన్ వేశారు. దీనిపై విచారణ జరిపిన వారణాసి కోర్టు.. మసీదు ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే చేపట్టాలని ఉత్తర్వులిచ్చింది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీల్ చేసిన వాజూఖానా ప్రాంతాన్ని మినహాయించి మసీదు ప్రాంగణమంతా కార్బన్ డేటింగ్, ఇతర పద్ధతుల ద్వారా శాస్త్రీయ సర్వే నిర్వహించాలని భారత పురావస్తు విభాగాన్ని ఆదేశించింది. ఇప్పుడు ఈ ఉత్తర్వులను హైకోర్టు కూడా సమర్థించింది.

## అలా చెప్పే ధైర్యం చంద్రబాబుకు ఉందా?: మంత్రి అంజాద్ బాషా



వైఎస్సార్ జిల్లా: రాయలసీమ ద్రోహి చంద్రబాబు అంటూ డిప్యూటీ సీఎం అంజాద్ బాషా మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాయలసీమ ప్రాంతానికి నీళ్లొస్తున్నాయంటే ఆ ఘనత వైఎస్సార్‌దేనన్నారు. రాయలసీమలో చంద్రబాబు ఒక్క ప్రాజెక్టయినా చంద్రబాబు ప్రారంభించారా? ఏ మొహం పెట్టుకుని రాయలసీమలో చంద్రబాబు తిరుగుతాడు" అని మంత్రి దుయ్యబట్టారు. "రాయలసీమ ప్రాంతానికి సీఎం జగన్ మంచి చేస్తుంటే బాబు అడ్డుకుంటున్నాడు. ప్రాజెక్టుల గురించి మాట్లాడే నైతిక హక్కు బాబుకు లేదు. రాయలసీమలో రైతన్నలకు ఏం చేస్తావో చెప్పే ధైర్యం చంద్రబాబుకు లేదు. చంద్రబాబు హయాంలో రాయలసీమ అభివృద్ధి చెందలేదు" అని మంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు.

## గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్ష.. కలెక్టర్లు యుద్ధప్రాతిపదిక ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



అమరావతి: పట్టణ ప్రాంతాల్లో నిర్మిస్తున్న టిడ్కో గృహాలు, ప్రధానమంత్రి ఆవాస యోజన గ్రామీణ్ గృహ నిర్మాణాల ప్రగతిపై సీఎస్ జవహర్ రెడ్డి సమీక్షించారు. " జిల్లా కలెక్టర్లు యుద్ధప్రాతిపదిక ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. ఈ నెలాఖరుకు 5 లక్షల గృహాలను పూర్తిచేసి లబ్ధిదారులకు అందించాలి. ఈ మేరకు గృహ నిర్మాణ శాఖ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. రాష్ట్రంలో గృహ నిర్మాణ పథకాలను మరింత వేగతవం చేయాలి. ఈ నెలాఖరుకు 5లక్షల గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించేందుకు వీలుగా తగు చర్యలు తీసుకోవాలి. నిర్మాణం పూర్తి చేసే ఇళ్ళు వాటి కాలనీల్లో తాగునీరు, విద్యుత్, రహదార్లు, డ్రైనేజీ, సోక్ పిట్లు నిర్మాణం వంటి కనీస సౌకరర్యాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేవాలి. గృహనిర్మాణాలు పూర్తి చేసే కాలనీల్లో ప్రత్యేక ఆర్చ్ లను ఏర్పాటు చేయాలి. ప్రతి జిల్లాలో ఈనెలాఖరుకు గృహనిర్మాణ కాలనీలను పూర్తి చేయాలి." అని సీఎస్ జవహర్ రెడ్డి అన్నారు.

## హంస నందిని బికినీ ట్రీట్.. బ్లాస్టింగ్

ఇండస్ట్రీలోకి అడుగుపెట్టే ప్రతి అమ్మాయి హీరోయిన్ కావాలనే కలలు కంటుంది. కానీ, అందరికీ ఆ కలలు నిజం కావు. నటి హంసా నందిని సైతం మంచి హీరోయిన్ అవ్వాలనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కానీ పాపం హీరోయిన్ గా క్లిక్ కాలేకపోయింది. దీంతో, ఐటెం సాంగ్స్, ఇతర పాత్రలకే పరిమితమైంది. ముఖ్యంగా అత్తారింటికి దారేది, మిర్చి, లౌక్యం వంటి సినిమాల్లో ఐటెం సాంగ్స్ లో మెరిసింది. ఆ పాటలు బాగా క్లిక్ అయ్యాయి. దీంతో, ఆమెకు ఎక్కువ గుర్తింపు వచ్చింది. అయితే, ఆపాటల తర్వాత ఆమెకు ఎక్కువగా మళ్లీ అలారాూటి అవకాశాలే రావడం గమనార్హం. గ్లామర్ రోల్స్ చేయడం మొదలుపెట్టింది. చిన్న చిన్న అవకాశాలు అయితే వచ్చాయి కానీ, తనను తాను నటిగా నిరూపించుకునే అవకాశం రాలేదనే చెప్పాలి. అయితే, ఈ బ్యూటీ తన ఫోకస్ మొత్తం సోషల్



మీడియాపై పెట్టింది. ఎప్పటికప్పుడు తన ఫోటోలు షేర్ చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. తాజాగా బికినీలో మెరిసింది. బ్లాక్ కలర్ బికినీలో తన థైస్ కనిపించేలా హాట్ ఫోజులు ఇచ్చింది. స్విమ్మింగ్ పూల్ వద్ద మంచి ఫోజు ఇచ్చి నిలపడింది. అంతే, ఇప్పుడు ఫోటోకి లైకుల వర్షం కురుస్తోంది. హంస అందాలకు నెటిజన్లు ఫిదా అయిపోతున్నారు. బ్యూటిఫుల్ మ్యామ్ అంటూ కొందరు, ఈ సండే ఇంత హాట్ గా ఉంటుందా అని కొందరు కామెంట్స్ చేస్తుండటం విశేషం. ఇదిలా ఉండగా, కొంతకాలం క్రితం హంస నందిని క్యాన్సర్ బారిన పడ్డారు. 2022 ఏడాది ఆరంభంలో తను ఈ మహమ్మారి కోరల్లో చిక్కకున్నట్టు ప్రకటించిన ఆమె.. చాలా బాధను అనుభవించింది. అప్పటి నుంచీ ట్రీట్మెంట్ తీసుకుంటూ.. అప్పడప్పుడు అప్ డేట్ ను అందిస్తూ వచ్చింది. చివరకు క్యాన్సర్ ను జయించింది. క్యాన్సర్ ని జయించిన తర్వాత ఆమె మరింత ఉత్సాహంగా సోషల్ మీడియాలో తన ఫోటోలను షేర్ చేస్తుండటం విశేషం. ప్రస్తుతానికి అయితే, ఆమె చేతిలో ఎలాంటి సినిమాలు లేవు.

## ఎన్టీఆర్ తర్వాత చరణ్‌తో ఖాయమేనా?

తనదైన అందం ప్రతిభతో ఆకట్టుకుంటున్న జాన్వీ కపూర్ సోషల్ మీడియాల్లో అసాధారణ ఫాలోవర్లతో భారతదేశంలో పాపులర్ సెలబ్రిటీగా గుర్తింపు తెచ్చుకుంది. అయినా కానీ తనకు తగినంత ప్రచారం లభించడం లేదని జాన్వీ భయపడుతోందని తెలిసింది. మంచి PRని నిర్వహించడంలో తాను ఎల్లపుడూ పూర్ అని సదరు యువనాయిక అంగీకరించింది. నెట్‌ఫ్లిక్స్‌లో జాన్వీ కపూర్ నటించిన 'బవాల్' సానుకూల సమీక్షలను అందుకుంది. అయితే సెల్ఫ్ ప్రమోషన్ విషయంలో తాను వెనుకబడిపోతున్నానని జాన్వీ అభిప్రాయపడింది. తాను స్వయం ప్రచారం చేసుకోకపోవడంతో తనను లేదా తన ప్రదర్శనలను ఎవరూ గమనించరని భయపడుతున్నట్లు కూడా జాన్వీ పేర్కొంది. సినీ పరిశ్రమ ప్రజా సంబంధాలు సహా దూకుడైన ప్రమోషన్‌ను నమ్ముతుంది. అయినా కానీ "చేసిన పని తనకు తానుగా మాట్లాడాలి" అనే సామెతను తాను ఎప్పుడూ నమ్ముతానని



యువనాయిక పేర్కొంది. ప్రస్తుతం ఎన్టీఆర్ సరసన 'దేవర' చిత్రంలో నటిస్తున్న ఈ బ్యూటీ టాలీవుడ్ లో దూసుకెళుతుందని భావిస్తే అది ఏమంత సులువుకాదని అర్థమవుతోంది. తదుపరి రామ్ చరణ్ సరసన బుచ్చిబాబు సనా దర్శకత్వంలో జాన్వీ నటిస్తుందని ప్రచారమైంది. ఈ సినిమా కోసం చర్చలు జరుపుతోందన్న టాక్ ఉంది. కానీ దీనికి సంబంధించి ఎలాంటి అధికారిక ప్రకటనా వెలువడలేదు. ఎన్టీఆర్ దేవరతో జాన్వీ కపూర్ తెలుగు తెరకు పరిచయమవుతోంది. వెనువెంటనే రామ్ చరణ్ సినిమాని ఆమె దక్కించుకుంటే టాలీవుడ్ లో వెనుదిరిగి చూసే పరిస్థితి ఉండదు. జాన్వీ చివరిసారిగా వరుణ్ ధావన్‌తో కలిసి OTT విడుదలైన 'బవాల్'లో కనిపించింది. ప్రస్తుతానికి తెలుగు చిత్రసీమ సహా దక్షిణాదిన తనని తాను ప్రమోట్ చేసుకునేందుకు జాన్వీ ప్రయత్నిస్తోంది. తనకు పీఆర్ కమ్యూనికేషన్ సరిగా లేనందున రేసులో వెనకబడ్డానని ఫీలవుతోంది. ఆ గ్యాప్ ని ఎలా ఫిల్ చేస్తుందో చూడాలి.




## చీరలో జాన్వీ సొగసు చూడతరమా?



చారెడేసి కళ్లతో కపూర్ గాళ్ జాన్వీ మాయ చేస్తోంది. అతిలోక సుందరి శ్రీదేవి వారసురాలిగా ఎన్నో అంచనాల నడుమ వెండితెరకు పరిచయమైన జాన్వీ కపూర్ పై ఆరంభం కొన్ని విమర్శలు వచ్చాయి. తన అందం నటన గురించి విమర్శించినవాళ్లున్నారు. అయితే కొద్ది కాలానికే తమ అభిప్రాయాల్ని మార్చుకుని జాన్వీ ముగ్ధ మనోహర రూపానికి తన నటనకు మంత్రముగ్ధులం అయిపోతున్నామని పొగిడేసిన వాళ్లు ఉన్నారు. ఇక ఇటీవలి కాలంలో కమర్షియల్ సినిమాల క్వీన్ గా ఎదిగేందుకు జాన్వీ చేయని ప్రయత్నం లేదు. హిందీలో వరుస చిత్రాల్లో నటించి తనని తాను నిరూపించుకున్న జాన్వీ కపూర్ త్వరలోనే టాలీవుడ్ లో ఆరంగేట్రం చేస్తోంది. ఎన్టీఆర్ సరసన దేవర చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతో జాన్వీకి పాన్ ఇండియా స్టార్ డమ్ ఖాయమైంది. కొరటాల శివ బిగ్ కాన్వాస్ పై దేవరను చిత్రీకరిస్తుండడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇకపోతే జాన్వీ కపూర్ నిరంతర ఫోటోషూట్లు అభిమానులకు స్పెషల్ ట్రీట్ గా నిలుస్తున్నాయనడంలో సందేహం లేదు. తాజాగా చీరలో కంటికి కునుకుపట్టనివ్వని ట్రీటిచ్చింది ఈ బ్యూటీ. చాలా కాలం తర్వాత శ్రీదేవి జూనియర్ ని చూసినట్టుగా ఉందంటూ ఈ ఫోటోలు వీడియోకు అభిమానులు వ్యాఖ్యల్ని జోడిస్తున్నారు. చారెడేసి కళ్లు అందమైన చిరునవ్వుతో జాన్వీ అలా చీరందంలో హొయలు పోతున్న తీరు ఈ వీడియోలో మైమరిపింపజేస్తోంది. ప్రస్తుతం ఇది అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది.

**జాన్వీ సుదీర్ఘ నోట్ సారాంశం:** జాన్వీ కపూర్ నటించిన బవాల్ ఇటీవలే ఓటీటీలో విడుదలై విమర్శకుల నుంచి మిశ్రమ స్పందనలు అందుకున్న సంగతి తెలిసిందే. నితేష్ తివారీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ ధావన్ కథానాయకుడిగా నటించాడు. ఈ చిత్రంపై కొందరు మిశ్రమ స్పందనలు వ్యక్తం చేయగా మరికొందరు ఇద్దరు నటీనటుల నటనను ప్రశంసించారు. తాజా ఫలితంతో అభిమానులకు కృతజ్ఞతలు తెలుపుతూ జాన్వీ సుదీర్ఘమైన నోట్‌ను రాసింది. అయితే తాజా రిపోర్ట్ ని అనుసరించి ఈ సీజన్ లో ఓటీటీలో వీక్షించిన అత్యంత పాపులర్ చిత్రంగా బవాల్ నిలిచింది. అభిమానుల నుండి తన నటనకు లభించిన ప్రేమకు జాన్వీ ఇన్‌స్టా వేదికగా ధన్యవాదాలు తెలిపింది. బవాల్ లో వరుణ్ హిస్టరీ టీచర్ అజయ్ పాత్రను పోషించగా, మూర్ఛ రోగి అయిన అతని భార్య నిషా పాత్రలో జాన్వీ నటించింది. ఐరోపాలో హనీమూన్ కి వెళ్లినప్పుడు ఈ జంట ఎలాంటి సమస్యలను ఎదుర్కొంది? అన్నది ఓటీటీ తెరపైనే చూడాలి.

## బాబోయ్ ఏంటి ఈ ఫోజు అమ్మడు?



2001వ సంవత్సరంలో ఇష్టం అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ శ్రియ శరన్. ఆ తర్వాత వెంటనే నాగార్జున సంతోషం సినిమాలో నటించింది. మొదటి రెండు సినిమాలు కూడా మంచి విజయాన్ని సొంతం చేసుకోవడంతో ఆ వెంటనే బాలకృష్ణకు జోడిగా చెన్నకేశవరెడ్డి సినిమాలో నటించింది. ఆ సినిమా కూడా విజయాన్ని సొంతం చేసుకుంది. అదే సంవత్సరం నువ్వే నువ్వే సినిమా, మెగాస్టార్ చిరంజీవి ఠాగూర్ సినిమా ల్లోనూ నటించిన ఈ ముద్దు గుమ్మ కి వెనక్కు తిరిగి చూసుకోవాల్సిన అవసరం రాలేదు. దాదాపు పది సంవత్సరాలు స్టార్ హీరోయిన్ గా కొనసాగి ఇప్పటికి కూడా అవకాశాలు దక్కించుకుంటూ సినిమాల్లో నటిస్తూనే ఉంది. పెళ్లి చేసుకుని ఒక బిడ్డకు తల్లి అయిన తర్వాత కూడా ఈ అందాల ముద్దుగుమ్మ స్కిన్ షో మాత్రం ఆపడం లేదు. సోషల్ మీడియాలో తన అందాల ఆరబోతతో ఫాలోవర్స్ కి షాక్ ఇస్తోంది. తాజాగా మరో సారి అందాలు ఎక్స్పోజ్ చేసింది. ఈ ఫోటోలో శ్రియ అందాల ఆరబోతతో పాటు ఆమె ఫిట్నెస్ ని కూడా చూడవచ్చు. కాలు 90 డిగ్రీలు లేపి మరి ఫోటోకి ఫోజ్ ఇచ్చింది. సాధారణంగా మూడు పదుల వయసు దాటిన హీరోయిన్స్ కొందరు ఈ స్థాయిలో ఫిట్గా ఉండరు. కానీ శ్రియ సరన్ మాత్రం నాలుగు పదుల వయసుకు చేరుతున్నా కూడా అంతే ఫిట్గా అందంగా కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ తెగ కామెంట్స్ చేస్తున్నారు. ఇంత అందంగా ఫిట్ ఉన్న ముద్దుగుమ్మ శ్రియ శరన్ కి వరుసగా ఆఫర్స్ రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. స్టార్ హీరోలు కూడా శ్రియ తో నటించాలని ఆశపడుతున్నారు.

## క్లీ వేజ్ తో కైపెక్కిస్తున్న క్యూట్ బ్యూటీ

ఉత్తరాది ప్రేక్షకులను పలు హిందీ సినిమాలు ఇంకా సిరీస్ లతో మెప్పించిన ముద్దుగుమ్మ సందీప ధార్. ఈ అమ్మడు 2010 సంవత్సరం లో ఇసి లైఫ్ మే సినిమా తో ఇండస్ట్రీలో అడుగు పెట్టింది. అప్పటి నుండి ఇప్పటి వరకు కూడా సినిమాలు, సిరీస్ లతో ప్రేక్షకులను అలరిస్తూనే ఉంది. ఈ అమ్మడికి అదృష్టం కలిసి రాకపోవడంతో భారీ ఆఫర్లు దక్కలేదు.. కానీ అందాల ఆరబోత ఫోటోలు మరియు వీడియోలతో ఎప్పుడు కూడా వార్తల్లో నిలుస్తూనే ఉంది. తాజాగా మరోసారి ఈ అమ్మడు క్లీ వేజ్ షో తో మతి పోగొడుతూ.. కైపెక్కిస్తూ ఈ క్యూట్ బ్యూటీ వావ్ అంటూ ప్రతి ఒక్కరు నోరు వెళ్లబెట్టేంత అందాల విందు చేసింది. ఈ రేంజ్ అందాల ఆరబోత చేసినా కూడా



స్టార్ హీరోలు ఈమె వైపు ఎందుకు చూడటం లేదు.. ఒక వేళ స్టార్ హీరోల సినిమా ల్లో ఆఫర్లు వచ్చినా కూడా చిన్న పాత్రలకే ఎందుకు పరిమితం అవుతుంది అంటూ నెటిజన్స్ కొందరు ప్రశ్నిస్తున్నారు. మొత్తానికి ఈ అమ్మడు క్లీ వేజ్ నడుము అందాలతో ఎప్పటికప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తూనే ఉంది. మొదటి సినిమా తో ఫిల్మ్ ఫేర్ అవార్డును అందుకోవడం తో పాటు పలు అవార్డులను సొంతం చేసుకుంది. దబాంగ్ 2 సినిమా లో గెస్ట్ రోల్ లో కనిపించిన ఈ అమ్మడు హీరో పంతి సినిమాలో మంచి పాత్రలో నటించి గుర్తింపు దక్కించుకుంది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పుష్కర కాలం అయినా ఈ అమ్మడు అందాల విందు విషయంలో తగ్గేదే లే అన్నట్లు ఇలాంటి హాట్ ఫోటో లు షేర్ చేస్తూనే ఉంది.

## కవ్విస్తున్న ఇస్మార్ట్ బ్యూటీ అందాలు

2015 సంవత్సరంలో వజ్రకాయ అనే కన్నడ సినిమాతో సినిమా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ నాభ నటేష్. ఈ అమ్మడు కన్నడంలో మూడు సినిమాలు చేసినా కూడా పెద్దగా గుర్తింపు రాకపోవడంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. 2018లో సుదీర్ బాబు హీరోగా నటించిన నన్ను దోచుకుందువటే అనే సినిమాలో హీరోయిన్గా నటించి ఆకట్టుకుంటుంది. తెలుగులో మొదటి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు సొంతం చేసుకుంది. సినీ ప్రముఖుల నుండి ఇంకా విమర్శకుల నుండి ప్రశంసలు దక్కించుకుంది. దాంతో వెంట వెంటనే అవకాశాలు లభించాయి. ముఖ్యంగా రామ్ కి జోడిగా నటించిన ఇస్మార్ట్ శంకర్ సినిమా భారీ విజయాన్ని సొంతం చేసుకోవడంతో పాటు అందులోని ఈ ముద్దుగుమ్మ పాత్రకి మంచి మార్కులు దక్కాయి.



ప్రస్తుతం సినిమాలేమీ చేయకుండా కూడా సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ అందాల ఆరబోత ఫోటో షూట్స్ చేస్తూ అలరిస్తుంది. తాజాగా ఈ ఫోటోలతో నెటిజన్స్ ని కవ్విస్తోంది.

ఈ రేంజ్ లో అందాలు ఆరబోత చేస్తే స్టార్ హీరోలు సైతం వావ్ అనాల్సిందే. కానీ అదృష్టం కలిసి రాకపోవడం వల్ల ఏమో కానీ ఈ ముద్దుగుమ్మకు ఆశించిన స్థాయిలో అవకాశాలు రావడం లేదు. ఇలాంటి ఫోటో షూట్స్ తో అయినా ఈ ముద్దుగుమ్మకి అవకాశాలు వస్తాయేమో చూడాలి. ఇంత హాట్ అందాల ఆరబోత చేస్తున్న నభ నటేష్ నడుము అందాలు చూపిస్తూ చేసిన ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముందు ముందు అయినా ఈమెకి ఆఫర్స్ వస్తాయేమో చూడాలి.




హైదరాబాద్: భారాస అంటే భారత 'రైతు' సమితి అని మరోసారి రుజువైందని ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఈ మేరకు ట్వీట్ చేశారు. "జై కిసాన్ అనేది మాకు కేవలం ఓ నినాదం కాదు.. మా ప్రభుత్వ విధానమని మరోసారి తేలిపోయింది. కేంద్రం అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం తగ్గినా.. కేంద్రంలోని భాజపా సర్కారు అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు సృష్టించినా.. రైతు రుణమాఫీని సంపూర్ణంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్ప బలానికి ఇది నిలువెత్తు నిదర్శనం. రైతు సంక్షేమంలో తొమ్మిదేళ్ల తెలంగాణ ప్రస్థానం దేశ చరిత్రలోనే ఒక సువర్ణ అధ్యాయం. రైతుకు రక్షణ కవచంగా అమలు చేసిన ప్రతి పథకం.. వ్యవసాయరంగ చరిత్రపై చెరగని సంతకం. దేశవ్యాప్తంగా వ్యవసాయం అంటే సంక్షోభం కానీ.. ఒక్క తెలంగాణలోనే వ్యవసాయం అంటే సంతోషం" అని కేటీఆర్ ట్వీట్ చేశారు.

## కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో కలపాలని సాయన్న పరితపించారు: కేసీఆర్


### కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నకు శాసనసభ నివాళులు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. కొంతకాలం క్రితం మృతిచెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్నకు శాసనసభ నివాళులర్పించింది. సంతాప తీర్మానాన్ని సీఎం కేసీఆర్ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సాయన్న లేని లోటు పూడ్చలేనిదన్నారు. కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో కలపాలని ఆయన పరితపించారని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడుతూ సాయన్న సేవలను కొనియాడారు. అనంతరం శాసనసభ రేపటికి వాయిదా పడింది. మరోవైపు శాసన మండలిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా జరిగిన ఆస్తినష్టం, ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై చర్చ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై మండలిలో సభ్యులు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఒకేసారి రైతు రుణమాఫీ చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీ కవిత కృతజ్ఞతలు తెలిపారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించినందుకు ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు చెప్పారు.



ఎన్నికలకు ముందు జరిగే చిట్టచివరి సమావేశాలుగా వీటిని భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో అధికార భారాసతో పాటు విపక్షాలైన కాంగ్రెస్, భాజపాలు కూడా కార్యకలాపాలను వేగవంతం చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పరస్పర విమర్శలు, ఆరోపణలు ఇప్పటికే హోరెత్తుతున్నాయి. ఈసారి సభాపర్వంలో కూడా ఆ వేడి, వాడి కనిపించే అవకాశముంది.

## గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు పిటిషన్‌పై తీర్పు రిజర్వ్



హైదరాబాద్: తెలంగాణలోని స్థానిక సంస్థల్లో ఖాళీగా ఉన్న పదవులకు ఎన్నికలపై హైకోర్టులో విచారణ జరిగింది. 220 సర్పంచ్‌లు, 94 ఎంపీటీసీ, 4 జడ్పీటీసీ, 5,364 వార్డులకు ఎన్నికలు జరగాల్సి ఉందని దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు ఇవాళ విచారణ చేసింది. ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో తెలిపేందుకు గడువు కావాలని అడ్వొకేట్ జనరల్ (ఏజీ) కోర్టును కోరారు. రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధంగా ఉన్నందున.. ప్రభుత్వం కూడా సమాయత్తంగా ఉండాలని న్యాయస్థానం ఆదేశించింది. రాష్ట్రంలో వరద సహాయక చర్యలు కొనసాగుతున్నందున 3 వారాలు సమయం కావాలని ఏజీ కోరారు. ఏజీ అభ్యర్థనతో పిటిషన్‌పై తదుపరి విచారణను ఉన్నత న్యాయస్థానం మూడు వారాలకు వాయిదా వేసింది.

**గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దుపై..** తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేయాలని దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులో వాదనలు పూర్తయ్యాయి. బయోమెట్రిక్ వివరాలు నమోదు చేయనందున పరీక్ష రద్దు చేయాలని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాదనలు విన్న ధర్మాసనం.. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష రద్దు చేయాలన్న పిటిషన్‌పై తీర్పును ఉన్నత న్యాయస్థానం రిజర్వ్ చేసింది.

**ఉపాధ్యాయుల బదిలీలపై విచారణ..** తెలంగాణలో టీచర్ల బదిలీలకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై త్వరగా విచారణ జరపాలని ఏజీ హైకోర్టును కోరారు. కొందరు వేసిన పిటిషన్ల కారణంగా సుమారు 80వేల మంది బదిలీల కోసం వేచి చూస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. బదిలీలపై విధించిన స్టే ఎత్తివేయాలని కోరుతూ మధ్యంతర పిటిషన్ కూడా వేశామని ఏజీ కోర్టుకు తెలిపారు. స్టే ఎత్తివేయాలన్న మధ్యంతర పిటిషన్‌పై సోమవారం విచారణ జరుపుతామని హైకోర్టు తెలిపింది.

## రైతు రుణమాఫీ.. రాష్ట్రవ్యాప్తంగా రైతుల సంబురాలు



హైదరాబాద్: రూ.19 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తున్నట్లు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిండటంతో రైతులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు సంబురాలు జరుపుకొంటున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిశేకాలు చేస్తున్నారు. వరి చేళల్లో కేసీఆర్ అక్షరాలు రాస్తూ ముఖ్యమంత్రికి తమ కృతజ్ఞతలు తెలుపుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజపేటలోని దూది వెంకటాపురంలో నారుతో కేసీఆర్ అక్షరాలు పేర్చి రైతులు తమ ఆనందాన్ని వెలిబుచ్చారు.

**ఆదిలాబాద్** : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రైతులు సంబరాలు జరుపుకుంటున్నారు. రైతు రుణమాఫీ ప్రకటించినందుకుగాను బోథ్ మండలం సోనాలలో రైతులు తమ పంట పొలాల్లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

సిద్దిపేట నియోజకవర్గంలోని జేపీ తండా, గట్ల మాల్యాల, సిద్దన్నపేట గ్రామాల ప్రజలు, రైతులు.. రుణమాఫీ చేసి మరోసారి రైతు బాంధవుడు అని నిదర్శనం అని చూపిన కేసీఆర్, మంత్రి హరీశ్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. రైతు హితం కోసం ఎన్నికష్టాలు వచ్చినా.. ఇచ్చిన మాట ప్రకారం రూ.19 వేలకోట్ల పంట రుణాలు మాఫీ చేశారని ఆనందం వ్యక్తంచేశారు.

**జగిత్యాల :** సిరిసిల్ల జిల్లా పెద్దూరులోని సింగల్‌విండో కార్యాలయం ఎదుట రైతులు, ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. జై కేసీఆర్, జై బీఆర్ఎస్ నినాదాలతో హోరెత్తించారు.

## కేసీఆర్ పాలన చూస్తే బాదేస్తోంది... ఇలాంటి మనిషి ఎక్కడా లేరు

న్యూఢిల్లీ: తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలన చూస్తే చాలా బాధ కలుగుతోందని కాంగ్రెస్ నేత జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈరోజు (గురువారం) ఉదయం ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే సమక్షంలో జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌పై విరుచుకుపడ్డారు. వందలాది మంది ప్రాణత్యాగాలు చేసి తెచ్చుకున్న రాష్ట్రమేనా ఇది అనిపిస్తుందన్నారు. దుర్మార్గ, అవినీతి, అహంకారపూరిత మనిషి (కేసీఆర్) ఎక్కడా లేరన్నారు. ఇంతటి అవినీతి బహుశా ప్రపంచంలో ఎక్కడా లేదని తెలిపారు. రాక్షస మనస్తత్వం కేసీఆర్ ది అని.. నాడు ఉద్యమ సమయంలో లక్షకు గతి లేదని... ఇప్పుడు ఎన్నికల్లో ఓట్లకు లక్షలు, కోట్లు ఖర్చు చేస్తున్నారని... ఇవన్నీ ఎక్కడ నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ధనిక రాష్ట్రం అప్పుల రాష్ట్రంగా మారిపోయిందన్నారు. తొమ్మిదేళ్లలో ఒక్కసారి కూడా సచివాలయం వెళ్ళని సీఎం దేశ చరిత్రలో ఎక్కడైనా ఉన్నారా? అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇబ్బందులు ఉన్నా సరే, పార్టీకి నష్టం జరుగుతుందని తెలిసి కూడా సోనియా గాంధీ



తెలంగాణ రాష్ట్రం ఇచ్చారన్నారు. రాబోయే ఎన్నికల్లో నూటికి నూరుపాళ్లు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చి సోనియా రుణం తీర్చుకోవాలని తెలిపారు. కర్ణాటకలో అవినీతి బీజేపీ సర్కారును ఓడించిన మాదిరిగా... అంతకు మించి అవినీతిలో కూరుకున్న కేసీఆర్ సర్కారును కూడా ఓడించాలని జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.




## ఈటల, జగ్గారెడ్డితో కేటీఆర్ ముచ్చట్లు.. అసెంబ్లీ వద్ద ఆసక్తికర సన్నివేశాలు




హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల వేళ గురువారం ఆసక్తికర సన్నివేశాలు చోటుచేసుకున్నాయి. భాజపా ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సీటు వద్దకు వెళ్లి మంత్రి కేటీఆర్ పలకరించారు. అనంతరం ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతలు సుమారు 10 నిమిషాలపాటు ముచ్చటించారు. ఆ తర్వాత అసెంబ్లీ వెలుపల కేటీఆర్, కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి మధ్య సరదా చర్చ జరిగింది. టీ షర్ట్‌లో ఉన్న జగ్గారెడ్డిలో చూసి పిల్లలతో కలిసి తిరిగితే ఎట్లన్న? అని కేటీఆర్ అనగా.. టీ షర్ట్‌తో వేసుకుంటే పిల్లలవుతారా? అని జగ్గారెడ్డి ఎదురు ప్రశ్నించారు. అప్పటికే జగ్గారెడ్డితో టీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు మామిల్ల రాజేందర్ కలిసి ఉండగా.. మీ ఇద్దరికి దోస్తాన్ ఎక్కడ కుదిరిందని కేటీఆర్ అడిగారు. దీంతో 'మాది ఒకే కంచం.. ఒకే మంచమని' మామిల్ల జవాబిచ్చారు. అయితే, జగ్గారెడ్డిని గెలిపిస్తావా?అని మంత్రి ప్రశ్నించగా.. 'సంగారెడ్డిలో జగ్గారెడ్డిని గెలిపిస్తా.. మన దగ్గరకు పట్టుకొస్తా అని' మామిల్ల రాజేందర్ సరదాగా వ్యాఖ్యానించారు.




హైదరాబాద్: కోకాపేట నియో పోలిస్ ఫేజ్-2 వేలంలో భూములకు భారీ డిమాండ్ ఏర్పడింది. నియో పోలిస్ భూములు వేలంలో రికార్డు స్థాయిలో ధర పలికాయి. నియో పోలిస్‌లో హెచ్ఎండీఏ ఎకరం భూమికి రూ. 35 కోట్లుగా ధరను నిర్ణయించింది. ఈ భూముల వేలంలో దిగ్గజ స్థిరాస్తి సంస్థలు పోటీపడ్డాయి. వేలంలో అత్యధికంగా ఎకరం భూమి ధర రూ. 72 కోట్లు.. అత్యల్పంగా రూ. 51.75 కోట్లు పలికింది. నియో పోలిస్ ఫేజ్-2లోని 6, 7, 8, 9 ప్లాట్ల వేలం ద్వారా హెచ్ఎండీఏకు రూ. 1,532.50 కోట్ల భారీ ఆదాయం సమకూరింది. తాజాగా నిర్వహించిన వేలంతో.. ఇప్పటివరకు కోకాపేట నియో పోలిస్‌లో 26.86 ఎకరాలకు వేలం పూర్తయింది. ఇవాళ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 వరకు 18.47 ఎకరాలకు వేలం నిర్వహించనున్నారు. ప్రస్తుతం నియో పోలిస్‌లో 10, 11, 14 ప్లాట్లకు వేలం కొనసాగుతోంది. వేలం జరుగుతున్న ప్లాట్లకు కూడా భారీగా ధర పలికే అవకాశం ఉంది.

## సీఎం కేసీఆర్ నిర్ణయాలతో ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్: మంత్రి హరీశ్ రావు



హైదరాబాద్: పోడుభూముల పంపిణీ, వీఆర్ఏల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, రైతు రుణమాఫీ చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో ప్రతిపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ వచ్చిందని మంత్రి హరీశ్ రావు అన్నారు. దెబ్బ మీద దెబ్బ కొట్టడంతో విపక్షాలు తట్టుకోవడం లేదని ఎద్దేవా చేశారు. కీలక నిర్ణయాల వల్ల ప్రతిపక్షాలకు ఏంమాట్లాడాలో తెలియడం లేదన్నారు. కేసీఆర్ తీసుకునే నిర్ణయాలతో విపక్షాల గొంతు మూగబోయిందని, వారికి ఓ వాయిస్ అంటూ లేకుండా పోయిందని విమర్శించారు. బయటే కాదు అసెంబ్లీలో కూడా విపక్షాలను సమర్థంగా ఎదుర్కొంటామని చెప్పారు. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా లాబీల్లో మంత్రి హరీశ్ మీడియాతో చిట్ చాట్ చేశారు.

**నల్లగొండ జిల్లాలో రాజకీయ వరదలు: జగదీశ్ రెడ్డి :** నల్లగొండ జిల్లాలో రాజకీయ వరదలు వస్తాయని మంత్రి జగదీశ్ రెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కొత్త పాత వరదలు కలుస్తాయని చెప్పారు. రాజకీయ పార్టీల్లో అంతర్గత కలహాలు సహజం అన్నారు.

**తెలంగాణ యాసలో సినిమాలు తీస్తా: మంత్రి మల్లారెడ్డి :** కాంగ్రెస్, బీజేపీల వద్ద డబుల్ బెడ్ రూమ్ అంశం తప్ప మరో అంశం లేదని మంత్రి మల్లారెడ్డి అన్నారు. రేవంత్ రెడ్డిపై తొడగొట్టిన తర్వాత గ్రాఫ్ పెరిగిందని చెప్పారు. కొంతమండి మీడియాలో తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. త్వరలోనే మీడియా సంస్థ ప్రారంభిస్తానని, తెలంగాణ యాసలో ఏడాదికి నాలుగు సినిమాలు తీస్తానని వెల్లడించారు. ఏది జరిగినా అంతా మన మంచికేనని అనుకుంటానన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో అభ్యర్థి ఎవరుండాలో డిసైడ్ చేసేది నేనే..




హైదరాబాద్ : తన అసెంబ్లీ సెగ్మెంట్లలో టికెట్ చర్చపై మంత్రి మల్లారెడ్డి స్పందించారు. నేడు తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అసెంబ్లీ లాబీలో మల్లారెడ్డి మాట్లాడుతూ.. మేడ్చెల్ నియోజకవర్గంలో ఏ పార్టీలో ఎవరు అభ్యర్థిగా ఉండాలో తానే డిసైడ్ చేస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీలో కూడా ఎవరు అభ్యర్థి ఉండాలో తానే డిసైడ్ చేస్తానని స్పష్టం చేశారు. గత ఎన్నికల సమయంలో కేఎల్ఆర్‌కు టికెట్ ఇప్పించింది తానేనన్నారు. మేడ్చల్ కాంగ్రెస్‌లో గ్రూప్ గొడవలు తామే సృష్టిస్తున్నామన్నారు. కాంగ్రెస్ అధిష్టానంలో తనకు దోస్తులు ఉన్నారని వెల్లడించారు. ఐటీ అధికారులు తన ఇంట్లో డబ్బులున్న గదినే చూడలేదని.. ఆ డబ్బులే ఇప్పుడు ఎన్నికలకు ఖర్చు చేస్తున్నానన్నారు. కాంగ్రెస్, బీజేపీ దగ్గర డబుల్ బెడ్ రూమ్ అంశం తప్ప వేరే సబ్జెక్టు లేదన్నారు. తాను చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోయి... ప్రతిపక్షాలు రెచ్చగొట్టే మాటలు వింటున్నారన్నారు. మంత్రివర్గ విస్తరణ అంటే మల్లారెడ్డి పోస్ట్ ఊడుతుందనే ప్రచారం చేశారన్నారు.

రేవంత్ రెడ్డిపై తొడగొట్టిన తరువాత గ్రాఫ్ పెరిగిందని మల్లారెడ్డి తెలిపారు. కొంతమంది మీడియా అసత్య ప్రచారం కక్షపురితంగా చేస్తోందన్నారు. త్వరలోనే మీడియా సంస్థ- ఏడాదికి నాలుగు తెలంగాణ యాస సినిమాలు తీస్తానన్నారు. ఏది జరిగినా అంతా మన మంచికే అనుకోవాలని మంత్రి మల్లెరెడ్డి తెలిపారు.

## ఇప్పటికైనా రైతు రుణమాఫీ గుర్తురావడం సంతోషం

హైదరాబాద్: ఎన్నికలు సమీపిస్తున్న వేల అయినా సీఎం కేసీఆర్‌కు రైతు రుణమాఫీ గుర్తు రావడం సంతోషమని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియాతో పాయింట్ వద్ద ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. 36 వేలలోపు బకాయిలు ఉన్న రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందన్నారు. విడతల వారిగా రైతు రుణమాఫీ చేస్తామని గత ఎన్నికల్లో ప్రకటించారని.. ఆ విధంగా ఇప్పటికే రైతు రుణమాఫీ పూర్తి కావాలన్నారు. రుణమాఫీ లేట్ కావడం వల్ల వడ్డీ పెరిగిందని... రుణమాఫీ మొత్తం వడ్డీకే సరిపోతుందని తెలిపారు. అన్ని సబ్సిడీలు ఎత్తేసి రైతు బంధు మాత్రమే ఇస్తున్నారని అన్నారు. ఆగష్టు వచ్చినా 6 ఎకరాల పైబడిన వారికి రైతు బంధు రాలేదన్నారు. వాయిదా పద్ధతిలో కాకుండా ఏక కాలంలో రైతు రుణమాఫీ చేయాలని ఎమ్మెల్సీ డిమాండ్ చేశారు. కొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని.. ఆ తర్వాత రుణమాఫీ చేస్తామని దాటవేసే అవకాశం లేకపోలేదన్నారు. రైతుల నమ్మకాన్ని కేసీఆర్ కోల్పోయారన్నారు. కేసీఆర్ బాండ్లను, చెక్కులను ఎవరూ నమ్మరని తెలిపారు. దళితబంధు అందరికీ ఇవ్వకుండా దళితులను కేసీఆర్ మోసం చేసారని మండిపడ్డారు. బీసీబంధుకు నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. అలాగే ముస్లింబంధు ఏమైందని నిలదీశారు. కేసీఆర్ మోసం చేయని వర్గం లేదన్నారు. కేసీఆర్ ప్రకటనలు చేయడం కాదు.. ఆచరణ కావాలని హితవుపలికారు. ఆర్టీసీని ప్రభుత్వంలో ఎలా కలుపుతారని కేసీఆర్ అన్నది వాస్తవం కాదా అని అడిగారు. ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ పథకం కావాలన్నారు. ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com